
కనువిందు చేస్తున్న జలపాతం



సోమందేపల్లి అడవుల్లో అలరిస్తున్న జలపాతం

హనుమా.. మము కనుమా..



శ్రావణమాస మూడో శనివారాన్ని పురస్కరించుకుని మండలంలోని పాలపాటిదిన్నె ఆంజనేయస్వామి దర్శనానికి భక్తులు పోటెత్తారు. సుదూర ప్రాంతాల నుంచి సైతం భక్తులు అధిక సంఖ్యలో తరలిరావడంతో ఆలయ పరిసరాలు కిక్కిరిసిపోయాయి. క్యూలైన్లు నిండిపోయాయి. గంటల తరబడి భక్తులు వేచివుండి స్వామిని దర్శించుకున్నారు. ఆంజనేయ స్వామి నామస్మరణతో ఆ ప్రాంతం మార్మోగింది. ఆంధ్రప్రగతి గ్రామీణ బ్యాంకు ఆర్ఎం రమేష్, లక్ష్మీనరసయ్య, గోవిందప్ప, ప్రభావతి, నిత్యకుమార్.. స్వామివారికి రూ.రెండులక్షలు సమర్పించారు. కడప నుంచి వచ్చిన మహిళలు ఆలయ ఆవరణలో కోటాలం ప్రదర్శించారు. మధ్యాహ్నం ఉత్సవ విగ్రహాన్ని ఊరేగించారు. కదిరి ఆర్టీసీ డిపో నుంచి ప్రత్యేక బస్సు సర్వీసులు నడిపారు.

-నల్లచెరువు



అలంకరణలో పాలపాటిదిన్నె ఆంజనేయస్వామి, దర్శనానికి క్యూలో వేచివున్న భక్తులు

హొయల లయలు..

ఎత్తైన కొండల నుంచి జాలువారే జలపాతాలు కనువిందు చేస్తాయి. వాటిని చూసి ముగ్ధులవుతుంటారు. అలాంటి జలపాతం.. అదీ వాలుగా హొయలు పోతూ ప్రవహిస్తే.. చూస్తే మతిపోవాల్సిందే. అలాంటి జలపాతాలను చూడాలంటే సోమందేపల్లి సమీప అడవుల్లోకి వెళ్లాల్సిందే. ఇటీవలిగా కురుస్తున్న భారీ వర్షాలకు జలపాతాలు జోరుగా ప్రవహిస్తున్నాయి. ఆ కొండల్లో సుడులు తిరుగుతూ నేలకు చేరుతున్నాయి. ఆ పక్కనే అడవుల్లో పచ్చదనం పరచుకుంది. అలా అటవీప్రాంతం ఆహ్లాదాన్ని పంచుతోంది. సోమందేపల్లి మండలంలోని నాగినాయనిచెరువు తండా, పెనుకొండ మండలం శెట్టిపల్లి గ్రామానికి మధ్య సుమారు 2వేల ఎకరాల్లో అటవీప్రాంతం ఉంది. ఇందులో అనేక నీటి గుంతలు, చెక్‌డ్యామ్‌లు ఉన్నాయి. కొండలు, గుట్టల్లోంచి జలపాతాలుగా జాలువారుతుంటే వాటిని చూసేందుకు, అక్కడ సేదతీరేందుకు పలువురు స్థానికులు, యువకులు ఉత్సాహం చూపుతున్నారు. ఈశ్వర్ రబ్బర్ ఫ్యాక్టరీ వెనుక వైపున సుమారు 3కి.మీ. దూరంలో జలపాతం ఉంది. నాగినాయనిచెరువు తండాకు సమీపంలోని అటవీప్రాంతంలో మరో జలపాతం ప్రవహిస్తోంది. అక్కడికి చేరుకోవాలంటే కాలినడకన వెళ్లాల్సిందే. అటవీ ప్రాంతంలో వన్యప్రాణుల సంచారం కూడా అధికంగా ఉందనీ, పర్యాటకులు జాగ్రత్తలు తీసుకోవాలని స్థానికులు సూచిస్తున్నారు.

-హిందూపురం(సోమందేపల్లి)



మీనం.. శూన్యం!

కొత్త జిల్లాలో కానరాని చేప



- మత్స్యసంపదపై గత ప్రభుత్వం తీవ్ర నిర్లక్ష్యం
- పైసా కూడా ఇవ్వని దుస్థితి
- చేపపిల్లల పెంపకం కేంద్రమే లేదు..
- చేపల పెంపకం ఊసేలేదు
- ఉపాధి కోల్పోయిన మత్స్యకారులు
- కూటమి ప్రభుత్వంపై ఆశలు

గత వైసీపీ ప్రభుత్వం రెండేళ్ల క్రితం ఆర్భాటంగా కొత్త జిల్లాను ప్రకటించింది. ఆ తర్వాత హామీలే తప్ప.. అభివృద్ధి కరువైంది. జిల్లాలో వేలమంది మత్స్యకారులున్నారు. చేపలు పట్టడం ద్వారానే కుటుంబాలను నెట్టుకొస్తున్నారు. గత వైసీపీ పాలకులు.. మత్స్యకారుల పొట్టకొట్టారు. కొత్త జిల్లాలో మత్స్యసంపద గురించే పట్టించుకోలేదు. రెండేళ్లలో ఒక్క చేప పిల్లల పెంపక కేంద్రాన్ని కూడా ఏర్పాటు చేయలేదు. రెండేళ్ల క్రితం చెరువులు, రిజర్వాయర్లు పూర్తిగా నిండిపోయాయి. వాటిలోకి కనీసం చేపపిల్లలను కూడా వదల్లేకపోయారు. ఇతర ప్రాంతాల్లో కొనుగోలు చేసి, తీసుకొచ్చి వదిలే దిశగా ఆలోచన కూడా చేయలేదు. దీంతో జిల్లాలో మత్స్యసంపద లేకుండాపోయింది. మత్స్యకార కుటుంబాలు రోడ్డున పడ్డాయి. ప్రభుత్వానికి ఆదాయం కూడా లేకపోయింది. గత టీడీపీ హయాంలో మత్స్యకారుల సంక్షేమానికి ఎన్నో పథకాలు అమలు చేశారు. సబ్సిడీపై పనిముట్లు పంపిణీ చేశారు. వైసీపీ హయాంలో వాటన్నింటినీ అటకెక్కించారు.


- పుట్టపర్తిరూరల్

కనీస చర్యల్లేవ్..

జిల్లాలో అధికారిక లెక్కల ప్రకారం 223 చెరువులు, మూడు రిజర్వాయిర్లు (చిత్రావతి బ్యాలెన్సింగ్ రిజర్వాయిర్, యోగివేమన రిజర్వాయిర్, జిల్లేడుబండ) ఉన్నాయి. వాటి పరిధిలో 47 మత్స్య సహకారసంఘాలున్నాయి. వాటిలో 3,957 మంది మత్స్యకారులు సభ్యులుగా ఉన్నట్లు అధికారులు చెబుతున్నారు. చెరువులు, రిజర్వాయర్లలో చేపల పెంపకం చేపడితే వారికి ఉపాధి లభిస్తుంది. గత వైసీపీ పాలనలో ఆ దిశగా చర్యలు తీసుకున్న దాఖలాల్లేవు. జిల్లాలోని చెరువులు రెండేళ్ల క్రితం పూర్తిస్థాయిలో నిండాయి. మత్స్యసంపద పెంపొందించే దిశగా గత ప్రభుత్వం కనీస చర్యలు చేపట్టిన పాపానపోలేదు. మత్స్యకారులకు శిక్షణ, అవగాహన కార్యక్రమాలు నిర్వహించిన దాఖలాల్లేవు. వారికి అవసరమైన వలలు, ఇతరత్రా పనిముట్లు కూడా పంపిణీ చేయలేదు. అధికారిక లెక్కల ప్రకారం గత రెండేళ్లలో 39 చెరువుల్లో మాత్రమే చేపల పెంపకం చేపట్టారు.



బుక్కపట్నం చెరువు



ప్రతిపాదనలు పంపాం

మత్స్యకారులకు ఆర్థిక చేయూత అందించేందుకు ఉన్నతాధికారులకు ప్రతిపాదనలు పంపాం. వాటికి ఆమోదం లభిస్తే మత్స్యకారులకు పథకాలను అందిస్తాం. జిల్లాలో రిజర్వాయర్లు, చెరువులు పూర్తిగా వర్షాధారంగా నిర్మించడంతో చేపపిల్లల పెంపకం సాధ్యపడట్లేదు. ప్రత్యామ్నాయం కోసం అన్వేషిస్తున్నాం.

- చంద్రశేఖర్‌రెడ్డి, జిల్లా మత్స్యశాఖాధికారి

కూటమి ప్రభుత్వంపై ఆశలు

ఇటీవలి ఎన్నికల్లో కూటమి ఘనవిజయం సాధించి, రాష్ట్రంలో అధికారం చేపట్టింది. దీంతో మత్స్యకార కుటుంబాల్లో ఆశలు చెలరేగాయి. గత టీడీపీ హయాంలో మత్స్యకారులకు పలు సంక్షేమ పథకాలు అమలు చేశారు. మత్స్యసంపద వృద్ధికి ప్రత్యేక చర్యలు చేపట్టారు. ఈ నేపథ్యంలో రాష్ట్రంలో మళ్లీ టీడీపీ కూటమి అధికారం చేపట్టడంతో సంక్షేమ పథకాలను అమలు చేస్తుందన్న ఆశాభావం మత్స్యకారుల్లో నెలకొంది. ప్రస్తుతం కురుస్తున్న భారీ వర్షాలకు చాలా చెరువులు నిండాయి. మిగిలిన వాటిలోకి నీరు చేరుతోంది. ఉపాధి అవకాశాల కల్పనపై ప్రభుత్వం దృష్టి సారించడంతో ఉపాధి లభిస్తుందనే ఆశలు మత్స్యకార కుటుంబాల్లో చిగురిస్తున్నాయి.

ఖాద్రీశుడి ఆలయం కిటకిట

భక్తులతో కిక్కిరిసిన ఆలయ ఆవరణం



కదిరి, ఆగస్టు 24: శ్రావణమాస మూడో శనివారాన్ని పురస్కరించుకుని ఖాద్రీ లక్ష్మీనరసింహస్వామి ఆలయం భక్తులతో కిటకిటలాడింది. స్వామివారిని తులసీమాలలు, కదిరి మల్లెలతో ప్రత్యేకంగా అలంకరించారు. స్వామివారి దర్శనానికి భక్తులు పోటెత్తారు. ఉదయం నుంచే క్యూలైన్లలో వేచిఉండి స్వామివారిని దర్శించుకున్నారు. ధ్వజస్తంభం వద్ద మహిళలు దీపాలు వెలిగించారు.

విమానాశ్రయంలో మెరుగైన భద్రత కల్పించండి

కలెక్టర్ ఆదేశాలు



సమావేశంలో పాల్గొన్న కలెక్టర్, అధికారులు

పుట్టపర్తి, ఆగస్టు 24: సత్యసాయి విమానాశ్రయంలో మెరుగైన భద్రతాఏర్పాట్లు చేపట్టాలని జిల్లా కలెక్టర్ చేతన్.. అధికారులకు సూచించారు. శనివారం ఎయిర్‌పోర్టు భద్రతా కమిటీ సమావేశం నిర్వహించారు. కలెక్టర్ మాట్లడుతూ.. విమానాశ్రయంలో భద్రతా పరమైన సమస్యలు తలెత్తినపుడు ఏయే శాఖలు, ఎలాంటి చర్యలు తీసుకోవాలనే అంశంపై అవగాహన కల్పించారు. అధికారులు, విమానాశ్రయ నిర్వాహకుల మధ్య సమాచార మార్పిడి, సమన్వయంతో భద్రతా ప్రమాణాలు పెంచాలని సూచించారు. అనంతరం విమానాశ్రయ సిబ్బంది ఏర్పాటు చేసిన పవర్‌పాయింట్ ప్రెజెంటేషన్‌ను వీక్షించారు. కార్యక్రమంలో విమానాశ్రయ డైరెక్టర్ సాయినాథ్ రెడ్డి, అడ్మిన్ లక్ష్మీనారాయణ, ఆర్డీఓ భాగ్యరేఖ, డీఎస్పీ విజయకుమార్, ఫైర్ సేఫ్టీ అధికారి హేమాద్రిరెడ్డి పాల్గొన్నారు.

ఉద్యాన పంటల సాగుకు పెద్దపీట

జిల్లాలో ఉద్యాన పంటల సాగుకు పెద్దపీట వేస్తున్నట్లు కలెక్టర్ చేతన్ పేర్కొన్నారు. స్థానిక కలెక్టరేట్‌లోని తన చాంబర్‌లో ఉద్యాన పంటల మార్కెటింగ్ అధికారులతో కలెక్టర్ సమీక్ష నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ.. జిల్లాలో టామోటా, మామిడి, వక్క పంటల సాగుకు ప్రభుత్వం ప్రత్యేక ప్రణాళిక సిద్ధం చేస్తోందన్నారు. అందులో భాగంగానే రైతులకు నూతన వంగడాలు, పండ్లకు తొడుగులు పంపిణీ చేస్తుందన్నారు. మార్కెట్ సౌకర్యం కల్పిస్తామన్నారు. బుక్కపట్నంలో మామిడి మార్కెట్ యార్డు ఏర్పాటుకు ప్రణాళిక సిద్ధం చేయాలని కలెక్టర్ ఆదేశించారు. కార్యక్రమంలో ఉద్యాన శాఖాధికారి చంద్రశేఖర్, మార్కెటింగ్ అధికారి నరసింహమూర్తి పాల్గొన్నారు.

ఆస్పత్రి నిర్మాణానికి స్థల పరిశీలన



స్థలాన్ని పరిశీలిస్తున్న అధికారులు, జీఎం శేఖర్

గోరంట్ల, ఆగస్టు 24: మండలంలోని పాలసముద్రం గ్రామ సమీపాన జాతీయ రహదారి పక్కన ఇండియన్ రెడ్‌క్రాస్ సంస్థ ఆధ్వర్యంలో అత్యాధునిక ఆస్పత్రి నిర్మాణానికి సంస్థ జిల్లా అధ్యక్షుడు జీఎం శేఖర్ శనివారం స్థలాన్ని పరిశీలించారు. గ్రామీణ పేదలకు మెరుగైన వైద్యసేవలు అందించడానికి రూ.8 కోట్ల వ్యయంతో రెడ్‌క్రాస్ సంస్థ ఆస్పత్రి నిర్మించ తలపెట్టింది. అధికారులు కొన్నిరోజులుగా స్థల పరిశీలన చేస్తున్నారు. గోరంట్ల మండలం అనువైనదిగా అధికారులు భావించారు. ఇప్పటికే జాయింట్ కలెక్టర్ అభిషేక్ కుమార్, ఆర్డీఓ భాగ్యరేఖ పాలసముద్రం సమీపంలోని సర్వే నంబర్ 130-3లోని 10.90 ఎకరాల్లో 4.50 ఎకరాల స్థలాన్ని ఆస్పత్రి నిర్మాణానికి పరిశీలించారు. ఆ స్థలాన్ని రెడ్‌క్రాస్ సంస్థ జిల్లా అధ్యక్షుడు జీఎం శేఖర్ పరిశీలించి, సుముఖత వ్యక్తం చేశారు. ఆయన మాట్లాడుతూ.. బ్లడ్ బ్యాంక్, క్యాన్సర్ టెస్టింగ్, హెల్త్ చెకప్, డయాలసిస్ సెంటర్, టెస్టింగ్ లేబరేటరీ, తదితర సౌకర్యాలు కల్పిస్తామన్నారు. కార్యక్రమంలో ఇన్‌చార్జి తహసీల్దార్ రెడ్డిశేఖర్, ఆర్ఐ సోమశేఖర్‌రెడ్డి, సర్వేయర్ తాతయ్య పాల్గొన్నారు.

టీడీపీ కార్యకర్తలపై వైసీపీ నాయకుల దాడి

బుక్కపట్నం, ఆగస్టు 24: మండలంలోని మారాల గ్రామంలో టీడీపీ కార్యకర్తలపై వైసీపీ నాయకులు శనివారం దాడి చేశారు. బాధితులు తెలిపిన వివరాల మేరకు.. టీడీపీ కార్యకర్తలు చెన్నయ్య, కిష్టమ్మ, నారాయణస్వామి, రాజేష్‌పై అదే గ్రామానికి చెందిన వైసీపీ మండల కన్వీనర్ సుధాకర్‌రెడ్డి, అతడి కుమారులు జగన్మోహన్ రెడ్డి, ధర్మతేజారెడ్డి, బంధువు కృష్ణారెడ్డి దాడిచేసి, గాయపరిచారు. చెన్నయ్య టీడీపీ వర్గీయుడన్న అక్కసుతో వైసీపీ నాయకులు దాడికి దిగారు. చెన్నయ్య బంధువులైన కిష్టమ్మ, నారాయణస్వామి, రాజేష్ సర్దిచెప్పడానికి వెళ్లారు. వారిపై కూడా దాడి చేసి, తీవ్రంగా గాయపరిచారు. దీనిపై పోలీసులకు ఫిర్యాదు చేశారు. గాయపడిన వారిని పెనుకొండ ఆస్పత్రికి తరలించారు. బాధితుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఏఎస్ఐ రమణ తెలిపారు.



గాయపడిన టీడీపీ కార్యకర్తలు

కొత్తచెరువు వైద్యురాలి ప్రతిభ

నీట్ పీజీలో 65వ ర్యాంకు సాధించిన లావణ్య

కొత్తచెరువు, ఆగస్టు 24: మండల కేంద్రానికి చెందిన వైద్యురాలు లావణ్య శనివారం వెలువడిన నీట్ పీజీ ప్రవేశ పరీక్ష ఫలితాల్లో ప్రతిభ కనబరిచారు. ఏకంగా ఆ లిండియా స్థాయి ఓపెన్ కేటగిరీలో 65వ ర్యాంకు సాధించారు. కొత్తచెరువుకు చెందిన గుట్టూరు శంకర కుమార్తె లావణ్య ఎంబీబీఎస్ గతేడాది పూర్తి చేశారు. పది, ఇంటర్, ఎంబీబీఎస్‌లో కూడా టాపర్‌గా నిలుస్తూ లావణ్య అందరి మన్ననలు పొందారు. ఆమె తండ్రి శంకర రైతు. వ్యవసాయ కుటుంబంలో జన్మించిన లావణ్య చదువులో ప్రతిభ కనబరుస్తుండటంతో మండల వాసులు అభినందిస్తున్నారు.



లావణ్య

బదిలీల సందడి





కలెక్టరేట్‌లో ఏఓకి బదిలీ దరఖాస్తులు అందజేస్తున్న రెవెన్యూ సిబ్బంది.. దరఖాస్తులు ఇచ్చేందుకు క్యూ

పుట్టపర్తి, ఆగస్టు 24(ఆంధ్రజ్యోతి): జిల్లా కలెక్టరేట్‌లో శనివారం బదిలీల సందడి కనిపిస్తోంది. సాధారణ బదిలీలకు ప్రభుత్వం గ్రీన్‌సిగ్నల్ ఇవ్వడంతో నచ్చిన స్థానాలు దక్కించుకునేందుకు అధికారులు, ఉద్యోగులు ముమ్మర ప్రయత్నాలు మొదలు పెట్టారు. నెలాఖరుకు 15 ప్రభుత్వ శాఖల్లో బదిలీల గడువు ముగియనున్న నేపథ్యంలో వారి వారి యత్నాల్లో నిమగ్నమయ్యారు. అన్ని శాఖల్లో జిల్లా స్థాయి అధికారులతోపాటు సూపరింటెండెంట్లు, సీనియర్, జూనియర్ అసిసెంట్లు, క్లాస్-4 ఉద్యోగులు బదిలీకానున్నారు. నచ్చిన ప్రాంతాలకు సిఫార్సులతో పోస్టింగ్ పొందేందుకు ముమ్మర ప్రయత్నాలు మొదలుపెట్టారు. రెవెన్యూ శాఖలో ఆర్ఐ, వీఆర్వోలు, సిబ్బంది బదిలీల కోసం జిల్లా కలెక్టరేట్‌లో దరఖాస్తు చేయడానికి క్యూకట్టారు. దీంతో సందడి నెలకొంది.

- స్కూళ్లలో తాగునీరు సరిగా ఉంచని యాజమాన్యాలు
- కొన్ని పాఠశాలల్లో టాయిలెట్లకు వెళ్లకుండా కట్టడి
- ప్రైవేట్ స్కూళ్లలో అడ్డగోలు నిబంధనలు
- ఇన్‌స్పెక్షన్ మర్చిపోయిన.. ఎంఈఓలు, డీవైఈఓలు
- చిన్నారుల ఆరోగ్యంతో యాజమాన్యాల చెలగాటం
- గతంలో వాటర్ బెల్
- నీరు తాగకపోతే ప్రమాదం తప్పదని వైద్య నిపుణుల హెచ్చరిక



వసి వాడుతున్న పసిప్రాయం

ఉదయం లేచినప్పటి నుంచి పరుగులే

మూడు పూటలా ముద్దతినని పిల్లలు ఎందరో

ప్రైవేట్ స్కూల్స్ డేటా...

పీఎస్	208	52,750
యూపీ	215	34,222
హైస్కూల్	247	78,680
మొత్తం	670	1,65,652



చదువుల తీరు మారింది. 'చదివింపుల' జోరు పెరిగింది. కార్పొరేట్ చదువులన్నీ కాంక్రీట్ జంగిల్‌లో నడుస్తున్నాయి. అంతా హడావుడే. ఉరుకులు.. పరుగులే. ఈ క్రమంలో పసిపిల్లలు దాహమేస్తే నీళ్లు తాగలేకపోవడం, మూత్ర మొస్తే పోయలేని పరిస్థితి నెలకొంది. పాఠశాలల యాజమాన్యాలు అర్థం పర్థం లేని నిబంధనలతో పసిమొగ్గలను ఉక్కిరిబిక్కిరి చేస్తున్నారు. దీంతో చిన్న పిల్లల్లో ఆరోగ్య సమస్యలు తలెత్తుతున్నాయి. విద్యాహక్కు చట్టం-2009 నిబంధ నలను ఏ ప్రైవేట్, కార్పొరేట్ పాఠశాల కూడా పాటించడం లేదు. స్కూళ్లను తనిఖీ చేయాల్సిన విద్యాశాఖాధికారులు వాటి ఊసే మరచి పోయారు. దీంతో ఎవరి నిబంధన లు వారివన్నట్లుగా యాజమాన్యాలు వ్యవహరిస్తున్నాయి. ఒకవేళ ప్రశ్నిద్దామని అనుకు న్నా.. తర్వాత తమ పిల్లలను ఎక్కడ టార్గెట్ చేస్తారోనన్న భయంతో విద్యార్థుల తల్లిదండ్రులు మిన్న కుండిపోతు న్నారు. ఈ పరిస్థితులు పిల్లల ఆరోగ్యానికి గొడ్డలిపెట్టుగా మారాయని అనేకమంది ఆరోపిస్తున్నారు.

అనంతపురం విద్య



డీఈఓ ఆఫీస్

వాటర్ బెల్... డల్

విద్యార్థులు డీహైడ్రేట్ కాకుండా ఉండటం కోసం గతంలో ప్రభుత్వం వాటర్ బెల్ కార్యక్రమాన్ని తీసుకొచ్చింది. దీని ప్రకారం పాఠశాల సమయంలో మూడుసార్లు గంట మోగిస్తారు. అది మోగగానే పిల్లలు నీళ్లు తాగాలి. ఉదయం 8.45 గంటలకు ఒకసారి, 10.50 గంటలకు ఒకసారి, 11.50 గంటలకు ఒకసారి బెల్ మొగిస్తారు. బెల్ మోగిన తర్వాత సుమారు 5 నిమిషాల వ్యవధిలో పిల్లలు నీళ్లు తాగాల్సి ఉంటుంది. ఇది వేసవిలో అమలు చేయాలని చెప్పారు. ఏడాది అంతా ఏర్పాటు చేసినా మంచిదే అని వైద్యులు చెబుతున్నారు. విద్యార్థులు పుస్తకాలు, హోంవర్క్, క్లాస్ రూమ్ టాస్క్ అంటూ హడావుడి, ఒత్తిడి వల్ల పిల్లలు సకాలంలో నీళ్లు తాగడం లేదు. విద్యార్థులపై తాగునీటి ప్రభావం చాలా పడుతోంది. ఇళ్ల నుంచి భోజనం క్యారియర్‌తోపాటు స్కూళ్లకు తీసుకెళ్లిన వాటర్ బాటిళ్లను సగానికి సగం కూడా తాగకుండానే విద్యార్థులు ఇళ్లకు వెనక్కు తీసుకెళ్తున్నారు. ముఖ్యంగా పిల్లల వెంట పంపే వాటర్ బాటిళ్లు చాలా వరకూ అర లీటర్ లేదా పావు లీటర్ బాటిళ్లే. అయితే వాటిని సైతం పూర్తి స్థాయిలో తాగకుండానే పిల్లలు ఇళ్లకు తీసుకొస్తుండటంపై విద్యార్థుల తల్లిదండ్రులు ఆందోళన చెందుతున్నారు. చాలా ప్రైవేట్, కార్పొరేట్ స్కూళ్లలో ఇదే తంతు జరుగుతోంది.

తిండి కూడా సరిగా తినరు

స్కూళ్లకు వెళ్లే పిల్లలు సక్రమంగా తిండి కూడా తినడం లేదు. ముఖ్యంగా ప్రాథమిక పాఠశాల విద్యార్థుల్లో ఈ సమస్య ఎక్కువగా ఉంది. సుమారు 6-11 ఏళ్ల మధ్యలో ఉన్న బాల బాలికలు ప్రధానంగా స్కూళ్లలో భోజనం సరిగా తినడం లేదు. స్కూళ్లకు పిల్లలను తీసుకెళ్లే బస్సులు ఉదయం 7 గంటలు, 7.30 గంటలకే వస్తున్నాయి. పల్లెల నుంచి పట్టణాలకు పిల్లలను తీసుకొచ్చే బస్సులు చాలా వరకూ ఇదే సమయానికి వస్తున్నాయి. 6 గంటలకు అటూ ఇటుగా నిద్ర లేచిన పిల్లలు, స్నానం చేసి 7 గంటల కల్లా స్కూలుకెళ్లడానికి సిద్ధం అవుతారు. ఆ సమయానికి తల్లులు ఇళ్లలో టిఫిన్ రెడీ చేసినా అంత పొద్దు పొద్దునే తినడానికి పిల్లలు ఇష్టపడరు. దీంతో బస్ హారన్ మోగగానే చాలా వరకూ ఖాళీ కడుపులతోనే ఇళ్ల నుంచి స్కూళ్లకు బయలుదేరి వెళ్లాల్సి వస్తోంది. స్కూల్‌కు చేరినా...తినడానికి 9 గంటలు లేదా...ఆపైన సమయం పడుతోంది. స్కూల్‌లో టీచర్ల అదిరింపులు, హడావుడి నడుమ తెచ్చుకున్న బాక్సును అరకొరగా తిని చెయ్యి కడిగేస్తున్నారు. ఇక మధ్యాహ్నం లంచ్ బాక్సులను మొత్తంగా వెనక్కు తెచ్చే పిల్లలు ఎంతో మంది ఉన్నారు. ఇక స్కూళ్లకు దగ్గరగా ఇళ్లు ఉన్న తల్లులు మాత్రం మధ్యాహ్నం క్యారియర్లు తీసుకుని వెళ్లి పిల్లలకు తినిపిస్తున్నారు. ఆ పిల్లల్లో ఈ సమస్య కనిపించకపోయినా ఇతర పిల్లల్లో మాత్రం ఈ సమస్య ఉంది.

సరిపడా మరుగుదొడ్లు ఏవీ...?



డిప్యూటీ డీఈఓ ఆఫీస్

ప్రైవేట్, కార్పొరేట్ స్కూళ్లలో పిల్లలకు సరిపడా వాష్‌రూమ్స్ ఏర్పాటు చేయడం లేదు. స్కూళ్ల ఏర్పాటుకు 1వ తరగతి నుంచి 7వ తరగతి వరకూ డీఈఓ స్థాయిలో, 8,9,10 తరగతులకు ఆర్‌జేడీ స్థాయిలో అనుమతులు ఇస్తారు. స్కూల్‌లో ప్రతి క్లాస్‌కు కనీసం రెండు టాయిలెట్స్ ఏర్పాటు చేయాలి. విద్యాశాఖ అధికారులు నిబంధనల మేరకు మొదటి సెక్షన్‌కు 60 మంది విద్యార్థులకు అనుమతి ఇస్తారు. మరో సెక్షన్ అంటే 40 మంది విద్యార్థులుండాలి. బిల్డింగ్, టాయిలెట్లు, టీచర్లను, ఇతర సదుపాయాలు కల్పించగలిగితే అదనంగా ఎన్ని సెక్షన్లకు అయినా అధికారులు అనుమతి ఇస్తారు. అయితే ఇక్కడ చాలా స్కూళ్లలో విద్యార్థులకు సరిపడా టాయిలెట్లు ఏర్పాటు చేయడం లేదు. తరగతి గదిలో 60 మంది విద్యార్థులుంటే తప్పనిసరిగా బాలికలకు ఒకటి, బాలురకు ఒకటి ఏర్పాటు చేయాలి. చాలా చోట్ల ఈ నిబంధనలు ఏ మాత్రం పాటించడం లేదు. వందలాది ప్రైవేట్ స్కూళ్లలో 3 లేదా, 4 టాయిలెట్లతోనే సరిపెడుతున్నారు. నామమాత్రంగా బాలికలకు, బాలురకు ఏర్పాటు చేసి చేతులు దులుపుకుంటున్నారు. అనంతపురం నగరంతోపాటు, గుంతకల్లు, కళ్యాణదుర్గం, తాడిపత్రి వంటి పట్టణాల్లోని పలు కార్పొరేట్ ప్రైవేట్ స్కూళ్లు అపార్టుమెంట్లులో ఏర్పాటు చేశారు. వీటిలో మూడు, నాలుగు అంతస్తుల్లోని క్లాసుల్లో ఉండే పిల్లలు కింద ఉండే టాయిలెట్లకు దిగొచ్చి మూత్రవిసర్జన, మల విసర్జన చేయడానికి అనేక ఇబ్బందులు పడుతున్నారు. అంతేకాకుండా పిల్లలు నీళ్లు ఎక్కువ తాగితే ఎక్కువసార్లు మూత్రవిసర్జనకు వెళ్లారంటూ టీచర్లు కట్టడి చేస్తున్నారు. సకాలంలో విద్యార్థులు వాష్‌రూమ్‌కు వెళ్లలేక అనారోగ్యాల బారిన పడుతున్నారు.



ఎంఈఓ కార్యాలయం

తనిఖీ మరిచిన అధికారులు

జిల్లా వ్యాప్తంగా 670 ప్రైవేట్ స్కూళ్లు ఉన్నాయి. వీటి పరిధిలో 1.65 లక్షల మంది విద్యార్థులు చదువుతున్నారు. అయితే ఎంఈఓ, డిప్యూటీ డీఈఓలు నెలకు 20 వరకూ అన్ని మేనేజ్‌మెంట్ స్కూళ్ల విజిట్ చేయాల్సి ఉంది. అయితే ఇవి సర్వసాధారణం. కానీ ఇన్‌స్పెక్షన్ చాలా క్షుణ్ణంగా చేయాల్సి ఉంటుంది. కనీసం రెండు స్కూళ్లు అయినా...ఇన్‌స్పెక్షన్ చేయాల్సి ఉంటుంది. ఇది సుమారు 3 నుంచి 4 రోజులు చేయాల్సి ఉంటుంది. ఆ స్కూల్ రికార్డులు, అడ్మిషన్ల తతంగం, ఫీజుల వివరాలు, లెసన్ ప్లాన్స్, టీచర్ల విద్యార్హతలు ఇలా అన్నీ తనిఖీ చేయాలి. అయితే చాలా మంది ఎంఈఓలు....ఈ తతంగాన్ని పూర్తిగా పక్కనబెట్టేశారు. డీవైఈఓలు, ఎంఈఓలు మామూళ్ల వసూళ్లకు మాత్రమే ప్రైవేట్ స్కూళ్ల మొహం చూస్తున్నారన్న విమర్శలు ఉన్నాయి. అధికారులు విజిట్స్, ఇన్‌స్పెక్షన్ నామమాత్రంగా మారడంతో ప్రైవేట్, కార్పొరేట్ స్కూళ్లలో ఇష్టారాజ్యంగా మారింది. దీనికితోడు డీవైఈఓలు, ఎంఈఓలు ముందుగానే టూర్ ప్రోగ్రామ్స్ ఉన్నతాధికారుల నుంచి అప్రూవల్ తీసుకోవాలి. ఆ టూర్ ప్రోగ్రామ్స్ పూర్తి చేసిన తర్వాత టూర్ డైరీని ఉన్నతాధికారులకు అందజేయాలి. డీవైఈఓలు ఆర్‌జేడీల నుంచి, ఎంఈఓలు డీఈఓ నుంచి టూర్ ప్రోగ్రామ్స్ తీసుకుని, తర్వాత టూర్ డైరీలను ఉన్నతాధికారులకు అందజేయాలి. గతంలో టూర్ డైరీ ఇవ్వకుంటే జీతాలు సైతం నిలిపివేసేవారు. అయితే ప్రస్తుతం అంతా మామూలుగా మారిపోయిందన్న విమర్శలు వస్తున్నాయి. ఈ నిర్లక్ష్యమే స్కూళ్లలో విద్యార్థుల ఆరోగ్యంపై తీవ్ర ప్రభావాన్ని చూపుతోంది.

పిల్లలు తగినంత నీరు తాగేలా చూడాలి

పెద్దలు ఆరోగ్యమే మహాభాగ్యం అన్నారు. ముఖ్యంగా పిల్లల విషయంలో మరింత జాగ్రత్త తీసుకోవాలి. ఆరోగ్యం బాగా లేకుంటే....ఆశించినంతగా ప్రతిభావంతులు కాలేరు. పిల్లల అవసరాలు, వారి ప్రవర్తన, సైకాలజీకి అనుగుణంగా బోధన చేయాలి. పిల్లలు స్కూళ్లలో తగినంత నీళ్లు తాగేలా చూడాలి. పిల్లల ఆరోగ్యం దృష్ట్యా గతంలో అమలు చేసిన వాటర్ బెల్ పూర్తి స్థాయిలో అమలయ్యేలా విద్యాశాఖ అధికారులు సైతం చర్యలు తీసుకోవాలి.



- వెంకటరత్నం, ఆప్టా జిల్లా ప్రధాన కార్యదర్శి

● నిర్లక్ష్యం చేస్తే అనేక సమస్యలు

మల, మూత్ర విసర్జన విషయంలో నిర్లక్ష్యం చేస్తే అనేక సమస్యలు కొనితెచ్చుకున్నట్లే. విద్యార్థి దశలో ప్రతి పిల్లవాడు కనీసం 2 నుంచి 3 లీటర్ల నీరు తప్పకుండా తీసుకోవాల్సి ఉంటుంది. అపుడే మల మూత్రాలు పద్ధతి ప్రకారం వస్తాయి. తిన్న ఆహారం జీర్ణమై పెద్ద పేగులలో 6నుంచి 8గంటలు మాత్రమే ఉంటుంది. ఆ సమయం దాటితే గట్టిగా మారి మలవిసర్జన ఇబ్బందిగా మారుతుంది. అపుడు తీవ్ర మలబద్ధకం వచ్చే అవకాశాలు ఎక్కువగా ఉన్నాయి. మూత్రానికి సరిగా వెళ్లకపోవడం, వస్తున్నా బిగిపట్టుకొని ఉండటం వల్ల మూత్రాశయ సంబంధిత వ్యాధులు వస్తాయి. కిడ్నీలలో చీముకారడం, రాళ్లు ఏర్పడడం వంటివి జరుగుతాయి. పదేపదే మూత్ర నాళాల ఇన్‌ఫెక్షన్స్ వస్తాయి.



- డాక్టర్ భీమసేనాచారి

● బాలికల్లో అనేక అనర్థాలు

నీరు సరిగా తాగకపోయినా, మలమూత్ర విసర్జన సకాలంలో చేయకపోయినా బాలికల్లో అనేక అనర్థాలు తలెత్తుతాయి. పాఠశాలల్లో సరైన వసతులు ఉండక, బాలికలు అక్కడ మలమూత్ర విసర్జనకు వెళ్లడానికి ఇబ్బంది పడతారు. సరిపడా నీళ్లు, అన్నం తీసుకోరు. ఇదే విషయం నా దగ్గరకు వచ్చిన తల్లిదండ్రులు చెబుతుంటారు. దీనివల్ల బాలికలు రక్తహీనత బారినపడి, ఇతర ఆరోగ్య సమస్యలతో చదువుపై ఏకాగ్రత కోల్పోతారు. నీరు సరిగా తాగకపోయినా, మూత్ర విసర్జనకు వెళ్లకపోయినా యూరిన్ ఇన్‌ఫెక్షన్స్ ఎక్కువగా వస్తాయి. అందుకే ప్రతి విద్యార్థిని కనీసం రోజుకు 3లీటర్ల నీరు తప్పకుండా తాగాలి. మలమూత్ర విసర్జనల విషయంలో ఎప్పటికపుడు వెళ్లాలి.



- డాక్టర్ షంషాద్ బేగం

కదిరి, తాడిపత్రి ఆలయాలను సందర్శించిన హైకోర్టు జడ్జి



కదిరి లక్ష్మీనరసింహస్వామి సన్నిధిలో జస్టిస్ సుజాత, న్యాయాధికారులు తదితరులు

కదిరి లీగల్/తాడిపత్రి, ఆగస్టు 24: రాష్ట్ర హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ వి.సుజాత శ్రీసత్యసాయి జిల్లా కదిరిలోని లక్ష్మీనరసింహస్వామి ఆలయాన్ని శనివారం సందర్శించారు. ఆమెకు తూర్పు రాజగోపురం వద్ద ఆలయ ఈఓ, ఆర్డీఓ వంశీకృష్ణ, తహసీల్దారు మురళీకృష్ణ, డీఎస్పీ శ్రీలత స్వాగతం పలికారు. ఆలయ అర్చకులు మంగళవాయిద్యాల నడుమ పూర్ణకుంభంతో న్యాయమూర్తికి స్వాగతం పలికారు. అనంతరం ఆమె స్వామివారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించుకున్నారు. పురోహితులు ఆలయ చరిత్రను, విశిష్ఠతను న్యాయమూర్తికి వివరించారు. స్వామివారి చిత్రపటాన్ని, తీర్థ ప్రసాదాలు అందజేశారు. ఆమె వెంట జిల్లా అదనపు న్యాయాధికారి సత్యవతి, న్యాయాధికారులు ప్రతిమ, మీనాక్షి సుందరి, కోర్టు పర్యవేక్షకులు అపర్ణ భాస్కర్ ఉన్నారు.

బుగ్గ రామలింగేశ్వరుడి సన్నిధిలో..

అనంతపురం జిల్లా తాడిపత్రి పట్టణంలోని బుగ్గ రామలింగేశ్వరస్వామి, చింతల వెంకటరమణస్వామి, గాయత్రీదేవి అమరలింగేశ్వరస్వామి ఆలయాలు, సత్యసాయి, శివసాయి మందిరాలను హైకోర్టు జడ్జి జస్టిస్ సుజాత శనివారం సందర్శించారు. ఆలయాల్లో ప్రత్యేక పూజలు నిర్వహించుకున్నారు. స్వామి, అమ్మవార్లను దర్శించుకుని, ఆలయాల చరిత్రను అర్చకులను అడిగి తెలుసుకున్నారు. శిల్పకళ సంపదను తిలకించారు. అంతకుమునుపు ఆలయ అర్చకులు పూర్ణకుంభంతో జస్టిస్ సుజాతకు స్వాగతం పలికారు. ఆమె వెంట అనంతపురం జిల్లా మొదటి అదనపు న్యాయాధికారి సత్యవతి, తాడిపత్రి జూనియర్ సివిల్ కోర్టు న్యాయాధికారి కృష్ణవేణి, డీఎస్పీ జనార్దన్‌నాయుడు, ఈఓ సుబ్రహ్మణ్యం, తాడిపత్రి బార్ అసోసియేషన్ ట్రెజరర్ శివరామకృష్ణ తదితరులు ఉన్నారు.



తాడిపత్రి పట్టణంలోని బుగ్గరామలింగేశ్వర ఆలయంలో...

వాస్తవాలు బయటపెట్టాలి

టీబీ డ్యాం గేట్ల ఎత్తు పెంపు అంశంపై సీపీఐ జగదీష్

గుంతకల్లు టౌన్, ఆగస్టు 24: తుంగభద్ర డ్యాం గేట్ల ఎత్తు పెంచిన వాస్తవాన్ని బోర్డు అధికారులు బయటపెట్టాలని సీపీఐ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు డి.జగదీష్ డిమాండ్ చేశారు. స్థానిక పార్టీ కార్యాలయంలో శనివారం ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. తుంగభద్ర డ్యాం ఎత్తు 1633 అడుగులు కాగా ఒక అడుగు ఎత్తు పెంచి గోప్యంగా ఉంచారని ఆయన ఆరోపించారు. గేట్ల ఎత్తు పెంచినట్లు కనీసం రికార్డుల్లోనూ చూపలేదని విమర్శించారు. డ్యాం గరిష్ఠ నీటి నిల్వ సామర్థ్యం 105 టీఎంసీలు కాగా.. ఒక అడుగు ఎత్తు పెంచడం వల్ల 20 టీఎంసీల నీరు అదనంగా నిల్వ ఉంటోందని అన్నారు. దీని ఆధారంగా కర్ణాటక, ఆంధ్రప్రదేశ్, తెలంగాణ రాష్ట్రాలకు నీటి వాటా ఎంతో చెప్పాల్సిన బాధ్యత డ్యాం అధికారులపై ఉందని అన్నారు. పెరిగిన నీటితో డ్యాం అధికారులు వ్యాపారం చేస్తున్నారా అనే అనుమానం కలుగుతోందని అన్నారు. అనంతపురం జిల్లా కలెక్టర్, నీటిపారుదల శాఖ ఎస్ఈ, జిల్లాకు చెందిన మంత్రి డ్యాం ఎత్తు పెంచింది నిజమో కాదో తెలుసుకోవాలని సూచించారు. జగన్ ప్రభుత్వంలో స్మార్ట్ మీటర్ల ఏర్పాటుకు షిర్డీసాయి, అదానీ కంపెనీలు పోటీ పడ్డాయని, స్మార్ట్ మీటర్లను సీపీఐ, టీడీపీ, సీపీఎం వ్యతిరేకించాయని అన్నారు. ఆ కాంట్రాక్టర్‌ను, టెండర్‌ను వెంటనే రద్దు చేయాలని డిమాండ్ చేశారు. ప్రస్తుతం కేంద్రం, రాష్ట్రంలో కూటమి ప్రభుత్వాలు ఉన్నాయని, రైల్వే వ్యాగన్ల మరమ్మతు కేంద్రం ఏర్పాటుకు కూటమి నేతలు కృషి చేయాలని ఆయన కోరారు.

మూడు నెలల్లోనే రూ.20.4 కోట్ల నిధులు

- ● అన్ని మండలాలకు ఉపాధి హామీ నిధులు
- ● పార్టీ ముఖ్య నేతలకు వివరించిన ఎమ్మెల్యే పరిటాల సునీత

అనంతపురం, ఆగస్టు 24 (ఆంధ్రజ్యోతి): తమ కూటమి అధికారంలోకి వచ్చిన మూణ్నెళ్లల్లోపే నియోజకవర్గానికి రూ.20.40 కోట్ల నిధులొచ్చాయని రాప్తాడు ఎమ్మెల్యే పరిటాల సునీత పేర్కొన్నా రు. ఆ నిధులతో చేపట్టనున్న అభివృద్ధి పనులు నాణ్యతతో పాటు గడువులోగా పూర్తయ్యేలా చూడాలని నాయకులను ఆదేశించారు. నగరంలోని తన క్యాంపు కార్యాలయంలో శనివారం ఆమె నియోజ కవర్గంలోని ముఖ్య నాయకులతో సమావేశమయ్యారు. నియోజక వర్గానికి ఉపాధిహామీ పథకం కింద సీసీ రోడ్ల నిర్మాణానికి నిధులు విడుదలయ్యాయన్నారు. ఇందులో ఆత్మకూరు మండలానికి రూ. 2.5 కోట్లు, అనంతపురం రూరల్‌కి రూ. 5.1 కోట్లు, రాప్తాడుకు రూ. 2 కోట్లు, కనగానపల్లికి రూ.3 కోట్లు, రామగిరికి రూ. 3 కోట్లు, చెన్నేకొత్తపల్లికి రూ. 3 కోట్లు నిధులు మంజూరయ్యాయన్నారు. రామగిరి, కనగానపల్లి, చెన్నేకొత్తపల్లి మండలాలకు అదనంగా రూ.1.80 కోట్లు మంజూరయ్యాయని ఆమె పార్టీ ముఖ్య నాయకులకు వివరించారు.



నాయకులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే పరిటాల సునీత

వచ్చేనెల నుంచి పనులు ప్రారంభించాల్సి ఉంటుంద న్నారు. ఇప్పటికే గ్రామాలవారీగా ఎక్కడెక్కడ ఏ ఏ పనులు చేపట్టాలో గుర్తించామన్నారు. గుర్తించిన ఆ పనుల ద్వారా గ్రామాల్లో రోడ్ల సమస్య తీరనుందన్నారు. ఐదేళ్ల వైసీపీ పాలనలో గ్రామాల్లో అధ్వాన పరిస్థితులు నెలకొన్నాయన్నారు. ఒక్క పైసా నిధులు కేటాయించకుండా ఐదేళ్ల పాలన కొనసాగించారని ఆమె విమర్శించారు.

ఏటీఎం దొంగల ముఠా అరెస్టు



వివరాలు వెల్లడిస్తున్న ఎస్పీ జగదీశ్

అనంత, చిత్తూరు, కర్ణాటకలో చోరీలు

అరకోటికిపైగా మాయం.. రూ.2 లక్షలే రికవరీ..

పట్టుబడింది ఐదుగురు.. పరారీలో ఏడుగురు..

అనంతపురం క్రైం, ఆగస్టు 24: ఏటీఎంలలో చోరీలకు పాల్పడుతున్న హరియాణా దొంగల ముఠాను అనంతపురం జిల్లా పోలీసులు శనివారం అరెస్టు చేశారు. వివిధ ప్రాంతాల్లో సుమారు కోటికి పైగా డబ్బు చోరీ చేసిన చేసిన వీరి నుంచి రూ.2లక్షలు మాత్రమే పోలీసులు రికవరీ చేశారు. ఈ ముఠాను పట్టుకునేందుకు అనంతపురం నగరంలోని నాలుగు పోలీస్‌స్టేషన్ల సీఐలు, సీసీఎస్, స్పెషల్ బ్రాంచ్, టెక్నికల్ స్టాఫ్, కర్ణాటక పోలీసులు శ్రమించారు. మొత్తం 12 మంది సభ్యులున్న ముఠాలో ఐదుగురు దొరికారు. మిగిలినవారు పరారీలో ఉన్నారు. కేసు వివరాలను ఎస్పీ జగదీష్ శనివారం డీపీఓలో వెల్లడించారు.

ఇవీ చోరీలు..

ఈ నెల 8న అనంతపురం నగరంలోని రామ్‌నగర్ ఎస్‌బీఐ ఏటీఎంలో చోరీ చేశారు. ప్రస్తుతం అరెస్టయిన ఐదుగురు, పరారీలో ఉన్న ఏడుగురు అక్కడికి వెళ్లారు. పోలీసులు, స్థానికులు గమనించకుండా ఎనిమిది మంది ఏటీఎం వద్ద వలయంగా ఏర్పడ్డారు. గ్యాస్ కట్టర్ నిపుణుడు సద్దాం సహా నలుగురు ముఖాలకు ముసుగులేసుకుని ఏటీఎం మిషన్‌ను కట్ చేశారు. అందులో ఉన్న రూ.29.80 లక్షలను ఎత్తుకెళ్లారు. ఇదే తరహాలో ఈ నెల 2న కల్లూరు ఎస్బీఐ ఏటీఎంలో రూ.3,26,600, జూన్ 7న కూడేరు మండల కేంద్రంలో రూ.18,41,300 ఏటీఎంలలో చోరీ చేశారు. ఫిబ్రవరి 8న అనంతపురం నగరంలోని ఫోర్త్ టౌన్ పోలీస్ స్టేషన్ సమీపంలో ఏటీఎం మిషన్‌ను కట్ చేసి నగదు తీసుకెళ్లేందుకు ప్రయత్నించారు. పోలీస్‌సైరన్ రావడంతో పారిపోయారు. కర్ణాటక రాష్ట్రంలోని చిక్‌బళ్లాపూర్‌లో ఏటీఎం సెంటర్‌లో రూ.18,24,500 చోరీ చేశారు. చిత్తూరు జిల్లా గుడిపాల పోలీస్‌స్టేషన్ పరిధిలోని ఏటీఎం సెంటర్లో రూ.25,98,400 చోరీ చేశారు.

అరెస్టు ఇలా..

అనంతపురం జిల్లాలో వరుసగా ఏటీఎంలలో చోరీలు జరగడంతో అప్పటి ఎస్పీ కేవీ మురళీకృష్ణ, నూతన ఎస్పీ జగదీష్ కేసులను ఛేదించాలని ఆదేశించారు. డీఎస్పీ టీవీవీ ప్రతాప్ ఆధ్వర్యంలో సీఐలు ఇస్మాయిల్, ప్రతాప్‌రెడ్డి, శ్రీధర్, శివరాముడు, షేక్ జాకీర్, సాయినాథ్, ఎస్ఐలు నాగమధు, గౌస్‌బాషా, రాజశేఖర్‌రెడ్డి ఆధ్వర్యంలో హెచ్‌సీలు శివయ్య, మల్లికార్జున, నాగరాజు, కానిస్టేబుళ్లు రంజిత్, దాస్, ఆసిఫ్, ప్రసా ద్, అనిల్, ఫరూక్, బాలు, ఓబుళేసు, వెంకటరమణ బృందాలుగా ఏర్పడ్డారు. ముఠాలోని ఐదుగురిని అనంతపు రం నగర శివారులోని కక్కలపల్లి క్రాస్ సర్వీస్ రోడ్డు పక్కన పొదలలో అరెస్టు చేశారు. వారి నుంచి గ్యాస్ సిలిండర్, గ్యాస్ కట్టర్, 5 సెల్‌ఫోన్లు, రూ.2లక్షల నగదు, 3 ఇనుప రాడ్లు, ఒక బాకు, కారం పొడి ప్యాకెట్, శానిటైజర్ స్ప్రే బాటిల్, పెయింట్ స్ప్రేలు, ఒక లారీని స్వాధీనం చేసుకున్నారు. డీజీపీ ద్వారకా తిరుమలరావు వీరిని అభినందించారు.

అరెస్టయింది వీరే..

హరియాణాలోని నుహ జిల్లా అలీమియో గ్రామానికి చెందిన రాబిన్, ఘసేరాకు చెందిన సలీం, రోజ్ కామియో గ్రామానికి చెందిన హక్మాఖాన్, అలీమియో గ్రామానికి చెందిన షాకీర్, రాజస్థాన్‌లోని భరత్ పుర జిల్లా ఆల్‌గని గ్రామానికి చెందిన మజీద్ అరెస్టు అయ్యారు. వసీం, సద్దాం, టౌసిఫ్, రాహుల్, హర్షద్, వారీష్, అతావుల్లా పరారీలో ఉన్నారు.

ముఠా నేపథ్యం

ఈ ముఠాలో రాబిన్, సలీం కీలక నిందితులు. షాకీర్ ట్రక్ డ్రైవర్. హరియాణా నుంచి బెంగళూరు హైవే మీద ప్రయాణిస్తూ.. ఏటీఎం కేంద్రాలు, అక్కడి భద్రత, సీసీ కెమెరాలు, రద్దీని గుర్తిస్తాడు. సులువుగా దొంగతనాలు చేసేందుకు అనువుగా ఉన్న ఏటీఎం కేంద్రాలను ఎంపిక చేసి.. రాబిన్, సలీంకు సమాచారం చేరవేస్తాడు. గ్యాస్ కటింగ్‌లో అనుభవమున్న సద్దాంతో రాబిన్ చర్చించి.. మిగిలిన సభ్యులను సమీకరించుకుంటాడు. అనంతరం ముఠా సభ్యులు నకిలీ నంబర్లతో రెండు కార్లలో ఎంపిక చేసుకున్న ఏటీఎం కేంద్రాలకు వస్తారు. ప్రజలు గాఢ నిద్రలో ఉన్న సమయంలో.. అర్ధరాత్రి 2 గంటల నుంచి తెల్లవారుజామున 4 గంటల మధ్యలో చోరీ చేస్తారు. చోరీ చేసిన సొమ్ములో కొంత మొత్తాన్ని ముఠా సభ్యులకు ఇచ్చి, మిగిలిన మొత్తాన్ని రాబిన్ తన వద్దే ఉంచుకుంటాడు. హరియాణా వెళ్లాక వాటాలు వేసుకుంటారు. ఎస్‌బీఐ ఏటీఎంలలో ఎక్కువ నగదు ఉంటుందని.. వాటినే ఎక్కువగా చోరీలకు ఎంచుకుంటారు. చిత్తూరు జిల్లా గుడిపాల ఏటీఎం చోరీలో కేసులో రాబిన్, సద్దాం, టౌసిఫ్ నిందితులు.



స్వాధీనం చేసుకున్న నగదు, గ్యాస్‌కట్టర్

ప్రమాదం తర్వాత ప్రమోదం

మళ్లీ నిండుతున్న తుంగభద్ర జలాశయం



నీటితో కళకళలాడుతున్న తుంగభద్ర జలాశయం

బళ్లారి, ఆగస్టు 24 (ఆంధ్రజ్యోతి): తుంగభద్ర జలాశయం నీటితో మళ్లీ కళకళలాడుతోంది. టీబీ డ్యాం అధికారులు శనివారం లెక్కలు వేసే సమయానికి 85.113 టీఎంసీల నీరు చేరింది. ఇన్‌ఫ్లో నిలకడగా ఉంటోంది. డ్యాం పూర్తిగా నిండిన తర్వాత ఈనెల 10న డ్యాం క్రస్ట్ గేటు కొట్టుకుపోయిన నేపథ్యంలో నీటిని నదికి మళ్లించిన విషయం తెలిసిందే. క్రస్ట్ గేటు స్థానంలో తాత్కాలికంగా స్టాప్‌లాగ్ ఎలిమెంట్ అమర్చారు. 70 టీఎంసీల నీటి నుంచి ఇప్పుడు 85.113 టీఎంసీల నీరు చేరాయి. ఈ ఆరురోజుల్లోనే దాదాపు 15 టీఎంసీల నీరు డ్యాంలోకి చేరాయి. డ్యాం పై భాగంలో వర్షాలు బాగా కురుస్తున్నాయి. డ్యాంలో 85 టీఎంసీల నీరు చేరడంతో రైతుల్లోనూ, అధికారుల్లో ఆనందం వ్యక్తం అవుతుంది. ఖరీఫ్, రబీకి మూడు రాష్ట్రాలతో పాటు గ్రామాలకు తాగునీరు కూడా ఇబ్బంది ఉండదని అధికారులు అభిప్రాయపడుతున్నారు.



ఓబుళదేవరచెరువులోని జ్ఞానసాయి ఇంగ్లీషు మీడియం స్కూల్‌లో శ్రీకృష్ణుడు, గోపికల వేషధారణల్లో చిన్నారులు



ధర్మవరం పట్టణంలోని కాకతీయ ఇంగ్లీషు మీడియం పాఠశాలలో ఉట్టి కొడుతున్న చిన్నారులు



ధర్మవరంలోని రూపారాజా పీసీఎంఆర్ పాఠశాలలో...



కొత్తచెరువు శ్రీచైతన్య పాఠశాలలో...



ధర్మవరం మండలంలోని గొట్లూరు గ్రామంలో శ్రీకృష్ణుడు, గోపికల వేషధారణలో శ్రీనివాస విద్యానికేతన్ పాఠశాల విద్యార్థులు

ఇదేనా సంక్షేమం..?

పుట్టపర్తి ఎస్సీ బాలుర వసతి గృహంలో అసౌకర్యాలు

సమస్యలతో విద్యార్థుల పాట్లు

120 మందికి మూడే మరుగుదొడ్లు

ఆరుబయటే స్నానాలు... లోపించిన పారిశుధ్యం...

పట్టించుకోని అధికారులు



పుట్టపర్తిరూరల్, ఆగస్టు 24: అధికారుల నిర్లక్ష్యం.. పేద విద్యార్థుల పాలిట శాపంగా మారింది. పేద విద్యార్థులకు మంచి వసతి, విద్య కల్పించాలనే ఉద్దేశంతో ప్రభుత్వం ఏర్పాటు చేసిన సంక్షేమ గృహాలు.. సమస్యలకు నిలయాలుగా మారాయి. సాక్షాత్తూ జిల్లాకేంద్రంలోని ఎస్సీ బాలుర వసతి గృహమే ఇందుకు నిదర్శనం. జిల్లా కేంద్రంలోనే పరిస్థితి ఇలా ఉంటే.. ఇక ఇతర ప్రాంతాల్లో ఉన్న వాటి పరిస్థితి ఎలా ఉంటుందో ఊహించుకోవచ్చు. జిల్లాకేంద్రంలోని గణేష్‌కూడలిలోని ఎస్సీ బాలుర వసతి గృహంలో విద్యార్థులు సవాలక్ష సమస్యలతో కొట్టుమిట్టాడుతున్నారు. జిల్లా స్థాయి అధికారులు కూతవేటు దూరంలో ఉన్నా... ఆ విద్యార్థుల సమస్యలను పట్టించుకునే నాథుడే కరవయ్యారు.

మరుగుదొడ్ల కొరత: ఈ వసతి గృహంలో మూడో తరగతి నుంచి పదో తరగతి వరకు చదువుకునే విద్యార్థులు 120 మంది ఉన్నారు. ఇంతమందికి మొత్తం 12 మరుగుదొడ్లు ఉండగా.. అందులో తొమ్మిది మరమ్మతులకు నోచుకోకపోవడంతో మూతపడ్డాయి. ఇక కేవలం మూడు మరుగుదొడ్లు మాత్రమే ఉన్నాయి. ఈ మరుగుదొడ్లలో ఏ ఒక్కదానికీ తలుపులు లేవు.

● **ఆరుబయటే స్నానాలు:** బాత్‌రూంలు లేకపోవడంతో ఆరుబయటే ఈ విద్యార్థులు స్నానాలు చేస్తున్నారు. స్నానాల తొట్టెలు పాచిపట్టి అపరిశుభ్రంగా ఉన్నాయి. తప్పని పరిస్థితుల్లో విద్యార్థులు అదే నీటితో స్నానాలు చేస్తుండటంతో రోగాల బారిన పడుతున్నారు.

● **లోపించిన పారిశుధ్యం:** స్నానాల కట్ట పాచిపట్టి మురుగుతో దుర్వాసన వస్తోంది. మరుగుదొడ్లలో అపరిశుభ్రత తాండవిస్తోంది. మురుగుదొడ్ల నిర్వహణ లేకపోవడంతో పారిశుధ్యం లోపించి దుర్వాసన వస్తోంది. దీనికి తోడు వర్షాకాలం కావడంతో దోమల బెడద తీవ్రమైంది. వసతి గృహం కిటికీలకు కనీసం మెష్‌లు కూడా లేకపోవడంతో విద్యార్థులు దోమలతో ఇబ్బందులు పడుతున్నారు. వసతి గృహం ప్రాంగణం మొత్తం చెత్త కుప్పలతో అపరిశుభ్రతతో నిండిపోయింది. వాటి గురించి అధికారులు ఏనాడూ పట్టించుకోలేదు.

తిరగని ఫ్యాన్లు: ఉదయం ఎండలు ... రాత్రి దోమల బెడద నుంచి ఉపశమనం పొందుదామంటే కనీసం ఫ్యాన్లు కూడా పనిచేయవు. దీంతో రాత్రి వేళల్లో విద్యార్థులపై దోమలు దండయాత్ర చేస్తున్నాయి.

ఊడుతున్న పెచ్చులు: భవనం శిథిలావస్థకు చేరుకుంది. సరైన నిర్వహణ లేకపోవడంతో కప్పు పెచ్చులూడి పడుతున్నాయి. దీంతో విద్యార్థులు బిక్కు.. బిక్కు మంటూ ఆ భవనంలో కాలం వెళ్లదీస్తున్నారు.

భోజనమూ అంతంతే...: ఈ వసతి గృహంలో భోజనం కూడా అధ్వానంగా ఉన్నట్లు సమాచారం. ఉన్నతాధికారుల పర్యవేక్షణ లేకపోవడంతోనే ఈ వసతి గృహాల్లో సిబ్బంది ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్నట్లు ఆరోపలున్నాయి.

ప్రతిపాదనలు పంపాం

ఈ వసతి గృహంలో సమస్యలపై ఉన్నతాధికారులకు ప్రతిపాదనలు పంపాం. నిధులు కేటాయించిన వెంటనే పనులు చేపడతాం.

-ఖుర్షీద్ అహ్మద్, వార్డెన్



కూలిపోయిన ప్రహరీ



మరుగుదొడ్డి ముందు నిలిచిన వర్షపునీరు



మురుగు కాలువలో పేరుకుపోయిన చెత్తాచెదారం

'సూర్యఘర్ ముక్త్ బిజిలీ'ని సద్వినియోగం చేసుకోండి: ఎస్ఈ

కదిరి అర్బన్, ఆగస్టు 24: ప్రధానమంత్రి సూర్యఘర్ ముక్త్ బిజిలీని సద్వినియోగం చేసుకోవాలని విద్యుత్ శాఖ ఎస్ఈ సంపత్‌కుమార్ సూచించారు. శనివారం పట్టణంలోని పీవీఆర్ గ్రాండ్‌లో ఏర్పాటుచేసిన అవగాహన సదస్సులో ఆయన పాల్గొని మాట్లాడారు. విద్యుత్ అవసరాలు రోజురోజుకీ పెరుగుతున్నాయనీ, అందుకు తగినవిధంగా ఉత్పత్తి లేదన్నారు. దీనికి ప్రత్యామ్నాయంగా ప్రతి వినియోగదారుడు ఇంటివద్ద విద్యుత్‌ను ఉత్పత్తి చేసుకుని వాడుకోవచ్చన్నారు. తద్వారా డబ్బు ఆదా అవుతుందన్నారు. సామాన్యులకు విద్యుత్ చార్జీల భారం తగ్గించేందుకు కేంద్రం ఈ పథకాన్ని తీసుకువచ్చిందన్నారు. కార్యక్రమంలో కదిరి డివిజన్ డీఈఈ మోసెస్ తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఎస్ఈ సంపత్‌కుమార్

అక్రమ నిర్మాణాల తొలగింపు

కొత్తచెరువు, ఆగస్టు 24: మండల కేంద్రంలోని స్థానిక బీసీకాలనీలో రోడ్డుకు ఇరువైపుల అక్రమంగా నిర్మించిన కట్టడాలను పంచాయతీ అధికారులు శనివారం జేసీబీతో తొలగించారు. 30 అడుగుల రోడ్డుపై ఇరువైపుల నిర్మాణాలు చేపట్టడంతో రాకపోకలకు ఇబ్బంది నెలకొంది. కాలనీకి చెందిన కొందరు అక్రమ కట్టడాలను తొలగించాలని పిర్యాదు చేశారు. దీంతో ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు పంచాయతీ అధికారులు అక్రమ నిర్మాణదారులకు నోటీసులు జారీ చేశారు. వారు తొలగించకపోవడంతో అధికారులే వాటిని తొలగించారు. అనంతరం పంచాయతీ కార్యదర్శి సురేంద్రరెడ్డి మాట్లాడుతూ రోడ్డుకు ఇరువైపులా డ్రైనేజీ నిర్మించడం జరుగుతుందన్నారు. ఎవరైనా పంచాయతీ రోడ్లపై అక్రమ నిర్మాణాలు చేపడితే వారికీ ఇదే పరిస్థితి హెచ్చరించారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు సాలక్కగారి శ్రీనివాసులు, ఒలిపిశీన, చికెన్‌సెంటర్ వెంకటేశ్, నల్లమాడ శంకర, డ్రైవర్ కేశప్ప తదితరులు పాల్గొన్నారు.

రైతులకు అవగాహన

ఓబుళదేవరచెరువు, ఆగస్టు 24: పాడిరైతులకు శనివారం జిల్లా పశుగణాభివృద్ధి సంస్థ కార్యనిర్వాహణాధికారి, డిప్యూటీ డైరెక్టర్ డాక్టర్ సుధాకర్ పెయ్యిదూడల పుట్టుకపై లింగనిర్ధారణ, కృతిమ గర్భధారణపై అవగాహన కల్పించారు. మండలంలోని మల్లెలవాండ్లపల్లిలో జరిగిన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ.. పశువులను పరిరక్షించుకోవడానికి ఉచిత గర్భకోశ చికిత్స శిబిరాలు ఏర్పాటు చేశామన్నారు. పెయ్యిదూడలను పొందే సూదులను ప్రభుత్వం సరఫరా చేస్తోందని, రూ.1,350 విలువ ఉన్న రెండు సూదులకు సబ్సిడీ పోను రూ.5 వందలు చెల్లిస్తే సరిపోతుందన్నారు. సూదులు వేసినా గర్భం నిలువకపోతే, డబ్బులు తిరిగి ఇవ్వడం జరుగుతుందన్నారు. కార్యక్రమంలో పశువైద్యాధికారి ప్రవీణ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

టీడీపీ కార్యకర్త మృతికి నివాళి

ముదిగుబ్బ, ఆగస్టు 24: మండల పరిధిలోని బ్రహ్మదేవరమర్రి గ్రామంలో టీడీపీ నాయకుడు తిరుపాల్ (48) రోడ్డు ప్రమాదంలో మృతి చెందడంతో ముదిగుబ్బ మండల కూటమి నాయకులు శనివారం నివాళులర్పించారు. అతని కుటుంబసభ్యులకు పార్టీ అండగా ఉంటుందని భరోసా కల్పించారు. రమేష్‌బాబు, అశ్వర్థరెడ్డి, తుమ్మల మనోహర్, సూరి తదితరులు నివాళులు అర్పించారు.

'మెరుగైన సేవలు అందించాలి'

పుట్టపర్తి, ఆగస్టు 24: వినియోగదారులకు మరింత మెరుగైన సేవలు అందించాలని డీఆర్‌డీఏ పీడీ నర్సయ్య సూచించారు. స్థానిక డీఆర్‌డీఏ కార్యాలయంలో ట్రాయ్ సీఏజీ సభ్యురాలు శారదా ఆధ్వర్యంలో టెలికాం వినియోగదారుల అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మారుమూల గ్రామాలు, అటవీ ప్రాంతాల్లో టెలికాం సేవలు పూర్తిస్థాయిలో లభించడంలేదని స్వయం సహాయ సంఘాలు తమ దృష్టికి తీసుకురావడం జరిగిందన్నారు. బీఎస్ఎన్ఎల్ ఎస్‌డీఈ క్రాంతికుమార్ మాట్లాడుతూ పుట్టపర్తి నియోజకవర్గంలోని సాతర్లపల్లి, అమగొండపాళ్యం, దొన్నికోటతోపాటు మరో రెండు ప్రాంతాల్లో ఐదు కొత్త బీఎస్ఎన్ఎల్ టవర్లను చేయడం జరుగుతోందన్నారు. వినియోగదారుల సమస్యలను ట్రాయ్ దృష్టికి తీసుకెళతామన్నారు. సమావేశంలో జిల్లా వినియోగదారుల సంఘం అధ్యక్షుడు సురేష్ కుమార్, మహిళా సమాఖ్య ప్రతినిధులు గంగా, అనూష, రోజ, స్పందన సంస్థ అధ్యక్షుడు ప్రసాద్, హరికృష్ణ, శివ, బీఎస్ఎన్ఎల్ డీఈ పృథ్వీప్రసాద్, జేసీఓ వీరభద్ర పాల్గొన్నారు.

కొనసాగిన సమ్మె

ధర్మవరం, ఆగస్టు 24: పట్టణంలోని శ్రీలక్ష్మీచెన్నకేశవాపురంలోని సత్యసాయి పంపు హౌస్ వద్ద మూడవ రోజు శనివారం సత్యసాయి తాగునీటి కార్మికులు సమ్మె కొనసాగించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ 5 నెలలుగా జీతాలు అందలేదని, 11 నెలలు పీఎఫ్ జమకాలేదని ఆవేదన వ్యక్తం చేశారు. అధికారులు సమస్యను పరిష్కరించాలని కోరారు.

నల్లమాడ సత్యసాయి కార్మికులు శనివారం నిరసన తెలిపారు. ఆరు నెలలుగా జీతాలు అందడంలేదని, తీవ్ర ఇబ్బందులు పడుతున్నామని ఆవేదన వ్యక్తం చేశారు. వెంటనే తమ సమస్యలను పరిష్కరించాలని కోరారు. నిరసనలో కేశవ, నాగభూషణ, శ్రీనివాసులు, రామాంజి, ఓబిరెడ్డి, రామమోహన్ తదితరులున్నారు.

కారు అపహరణ

ముదిగుబ్బ, ఆగస్టు 24: మండల కేంద్రలోని పాత పోస్టాఫీస్ వీధిలో శుక్రవారం అర్ధరాత్రి గుర్తుతెలియని వ్యక్తులు కారును అపహరించినట్లు పోలీసులు తెలిపారు. పాత పోస్టాఫీస్ వీధిలో నివాసముంటున్న విజయసింహ కారును అద్దెకు నడుపుతున్నాడు. శుక్రవారం రాత్రి ఇంట్లో నిద్రిస్తున్న సమయంలో శబ్దం రావడంతో బయటకు వెళ్లి చూడగా అప్పటికే పార్కింగ్‌లో ఉన్న కారు కనిపించలేదు. బాధితుడి ఫిర్యాదు మేరకు పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

సమస్యలు ఎవరికి చెప్పుకోవాలి?

సమావేశం మధ్యలోనే అధికారులు వెళ్లిపోతున్నారు

బాలసముద్రం ఎంపీటీసీ

తనకల్లు, ఆగస్టు 24: మండల సర్వసభ్య సమావేశానికి హాజరవుతున్న అధికారులు చివరి వరకు ఉండకుండా మధ్యలోనే వెళ్లిపోతున్నారని, తమ సమస్యలను ఎవరికి చెప్పుకోవాలని బాలసముద్రం ఎంపీటీసీ అమర్‌కార్తికేయ ప్రశ్నించారు. శనివారం మండల కేంద్రంలోని ఎంపీడీఓ కార్యాలయంలో ఎంపీపీ కౌసల్య అధ్యక్షతన మండల సర్వసభ్య సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఏడాదిగా చెబుతున్నా తమ సమస్యలు పరిష్కారం కావడంలేదని అమర్‌కార్తికేయ ఆవేదన వ్యక్తం చేశారు. సమస్యలు పరిష్కారమయ్యే దిశగా చర్యలు తీసుకోవాలని కోరారు.

ఆంజనేయుడికి ప్రత్యేక పూజలు



గాండ్లపెంట, ఆగస్టు 24: శ్రావణమాస శనివారం సందర్భంగా అంజనేయస్వామికి ప్రత్యేక పూజలు జరిగాయి. బొల్లుగుట్లపల్లి, వేపరాల, కురమామిడి, గాండ్లపెంట, మునగలవారిపల్లి, పాయకట్టు తదితర గ్రామాల్లో ప్రత్యేక అలంకరణ చేసి పూజలు చేశారు. భక్తులకు తీర్థప్రసాదాలతోపాటు అన్నదానం సౌకర్యం ఏర్పాటు చేశారు.

నంబులపూలకుంట: మండలంలోని అంజనేయస్వామి ఆలయాల్లో ప్రత్యేక పూజలు చేశారు. ఆకుపూజలో ప్రత్యేకంగా స్వామివారిని అలంకరించారు. భక్తులకు తీర్థప్రసాదాలతోపాటు అన్నదానం చేశారు.

నల్లమాడ: పెద్దకోట్లపల్లి, ఎద్దులవాండ్లపల్లి, రెడ్డిపల్లి, నల్లమాడ, వంకరకుంట గ్రామాల్లోని స్వామివారి ఆలయాల్లో ప్రత్యేక పూజలు నిర్వహించిన అనంతరం అలంకరణ చేశారు.

వైభవంగా వెంకటేశ్వరుడి కల్యాణం

ధర్మవరం, ఆగస్టు 24: పట్టణంలోని శ్రీనివాసనగర్‌లో వెలసిన వెంకటేశ్వరస్వామి ఆలయంలో స్వామివారి కల్యాణోత్సవాన్ని ఆలయ కమిటీ ఆధ్వర్యంలో అర్చకుడు రాజేశ్ వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా మహిళలు ఏడు శనివారాల వ్రతాన్ని సామూహికంగా నిర్వహించారు. అనంతరం స్వామివారి కల్యాణోత్సవాన్ని రుత్వికులు వైదమంత్రోచ్చారణల నడుమ వైభవంగా నిర్వహించారు. భక్తులు అధికసంఖ్యలో తరలివచ్చి స్వామివారి కల్యాణోత్సవాన్ని తిలకించారు. అనంతరం ఆలయ కమిటీ ఆధ్వర్యంలో అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ అధ్యక్షుడు చెన్నంశెట్టి జగదీశర ప్రసాద్, ప్రధాన కార్యదర్శి జింకా రాజేంద్రప్రసాద్, సభ్యులు చెన్నంశెట్టి శ్రీనివాసులు, చెన్నంశెట్టి రమేశ్ పాల్గొన్నారు.

ఘనంగా ధ్వజస్తంభ ప్రతిష్ఠ

ధర్మవరంరూరల్, ఆగస్టు 24: మండలంలోని కుణుతూరు గ్రామంలో వెలసిన ఆంజనేయస్వామి దేవాలయంలో నూతన ధ్వజస్తంబ ప్రతిష్ఠను శనివారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా రుత్వికులు ఉదయం మహాగణపతిపూజ, పుణ్యాహవాచనం, పంచగవ్యప్రోక్షణ, నవగ్రహపూజ, కలశస్థాపన, మహాస్నపనము, గణపతి, వాస్తు నవగ్రహ, రుద్రహోమాలు నిర్వహించారు. అనంతరం ఆలయం ఎదుట ధ్వజస్తంభాన్ని ప్రతిష్ఠ చేశారు.

సమర్థవంతంగా పనిచేశారు: ఎస్పీ

పుట్టపర్తిరూరల్, ఆగస్టు 24: ఇటీవల బదిలీ అయిన అదనపు ఎస్పీ విష్ణు, డీఎస్పీలు వాసుదేవన్, శ్రీలతకు జిల్లా పోలీసు కార్యాలయంలో శనివారం ఘనంగా వీడ్కోలు పలికారు. విధి నిర్వహణలో వారి సేవలను ఎస్పీ కొనియాడారు. వారికి అప్పగించిన బాధ్యతలను సమర్థవంతంగా నిర్వహించారన్నారు. కార్యక్రమంలో ఏఆర్ డీఎస్పీ విజయ్‌కుమార్, ఏఓ సుజాత, ఎస్‌బీ సీఐ బాలసుబ్రహ్మణ్యంరెడ్డి, ఆర్‌ఐలు చంద్రశేఖర్, వలి పాల్గొన్నారు.



సన్మానిస్తున్న ఎస్పీ

ట్రాన్స్‌ఫార్మర్ ఏర్పాటు

కొత్తచెరువు, ఆగస్టు 24: కరెంట్‌కు కటకట కథనానికి ట్రాన్స్‌కో అధికారులు స్పందించారు. వేణుగోపాల్‌నగర్‌లో పది రోజులక్రితం విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ కాలిపోయింది. దీంతో కాలనీవాసులు ఇబ్బందులు పడ్డారు. ఆంధ్రజ్యోతి కథనంతో ఉన్నతాధికారులు స్పందించి నూతన ట్రాన్స్‌ఫార్మర్‌ను ఏర్పాటు చేశారు. దీంతో సమస్య పరిష్కారమైంది.



నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

మండల కేంద్రంలోని 33 కేవీ సబ్‌స్టేషన్‌లో మరమతుల కారణంగా ఆదివారం ఉదయం 10 గంటల నుంచి సాయంత్రం 4 గంటలకు వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని ట్రాన్స్‌కో ఏఈ వెంకటేశనాయక్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు.

పుట్టపర్తి: జిల్లా కేంద్రంతోపాటు పుట్టపర్తి రూరల్ మండలంలో ఆదివారం ఉదయం 10 గంటల నుంచి సాయంత్రం నాలుగు గంటల వరకు విద్యుత్ సరఫరాను నిలిపివేస్తున్నట్లు ట్రాన్స్కో అర్బన్ ఏఈ నారాయణమ్మ తెలిపారు. 132 కేవీలైన్‌లో మరమ్మతుల కారణంగా విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందన్నారు.

ద్విచక్రవాహనాన్ని ఢీ కొన్న కారు... మహిళ మృతి

బత్తలపల్లి, ఆగస్టు 24: మండల పరిధిలోని రాఘవంపల్లి క్రాస్ సమీపంలో శనివారం ద్విచక్ర వాహనాన్ని కారు ఢీకొన్న ప్రమాదంలో సరోజమ్మ(50) మృతిచెందారు. తాడిమర్రి మండలం అత్మకూరు గ్రామానికి చెందిన వెంకటనారాయణ, అతడి భార్య సరోజమ్మ, మనవడు చరణ్, మనవరాలు అలేఖ్యతో అనంతపురం వెళ్తుండగా బత్తలపల్లి మండలం రాఘవంపల్లి క్రాస్ సమీపంలోకి రాగానే వెనుక వస్తున్న కారు ద్విచక్ర వాహనాన్ని ఢీకొంది. ప్రమాదంలో సరోజమ్మ అక్కడికక్కడే మృతి చెందగా భర్త మనవడు, మనవరాలికి స్వల గాయాలయ్యాయి. వీరిని బత్తలపల్లి ఆర్‌డీటీ ఆసుపత్రికి చికిత్స నిమిత్తం తరలించారు. విషయం తెలుసుకున్న ఎస్ఐ శ్రీనివాసులు ప్రమాద స్థలాన్ని పరిశీలించి కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

కేబుల్ వైర్ చోరీ

ధర్మవరంరూరల్, ఆగస్టు 24: తన వరిమడిలోని కేబుల్‌వైరును గుర్తు తెలియని వ్యక్తులు శుక్రవారం రాత్రి చోరీ చేసినట్లు ఏలుకుంట్ల గ్రామానికి చెందిన రైతు చంద్రమోహన్ తెలిపాడు. శనివారం ఉదయం వరిమడికి నీళ్లుపెట్టేందుకు తోటవద్దకు వెళ్లగా సుమారు 40 మీటర్ల కేబుల్‌వైర్ చోరీకి గురైనట్లు గుర్తించానన్నారు. చోరీపై పోలీసులకు సమాచారం ఇచ్చానన్నారు.

'పనిముట్లు అందజేయాలి'

కదిరి అర్బన్, ఆగస్టు 24: మునిసిపల్ పారిశుధ్య కార్మికులకు పనిముట్లు అందచేయాలని మునిసిపల్ వర్కర్స్ యూనియన్ నాయకులు శనివారం సీఐటీయూ ఆధ్వర్యంలో కమిషనర్ కిరణ్‌కుమార్‌కు వినతిపత్రం అందజేశారు. పరకలు, పారలు, గ్లౌజులు, కొబ్బరినూనె అరకొరగా సరఫరా చేస్తున్నారన్నారు. కరోనా సమయంలో పనిచేసిన కార్మికులను విధుల్లోకి తీసుకోవాలన్నారు మునిసిపల్ నాయకులు జనార్దన్, బాలకృష్ణ, తిరుపాల్, సూరి, సీఐటీయూ జగన్మోహన్, బాబ్‌జాన్ తదితరులు వినతిపత్రం సమర్పించిన వారిలో ఉన్నారు.



అలరించిన భక్తిగీతాలు

పుట్టపర్తి, ఆగస్టు 24: సంగీత కళాశాల విద్యార్థులు భక్తిగీతాల ఆలాపనతో అలరింపజేశారు. కృష్ణాష్టమి వేడుకల సందర్భంగా శనివారం సాయంత్రం సాయికుల్వంత్ మందిరంలో సంగీత కళాశాల విద్యార్థులు సంగీత కచేరి నిర్వహించారు. మధురమైన పాటలతో భక్తులను తన్మయం చేశారు. అనంతరం సత్యసాయి మహా సమాధిని దర్శించుకున్నారు.

క్రీడాసామగ్రి పంపిణీ

కదిరి, ఆగస్టు 24: తలుపుల మండలంలో కస్తూర్బా పాఠశాలలో ఆర్టీటీ రీజనల్ డైరెక్టర్ శాంతమ్మ ఆధ్వర్యంలో శనివారం విద్యార్థులకు క్రీడాసామగ్రి పంపిణీ చేశారు. విద్యతోపాటు క్రీడల్లో రాణించి పాఠశాలకు మంచి పేరు తీసుకురావాలని ఈ సందర్భంగా ఆమె వారికి సూచించారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ మోహనమ్మ, ఏటీఎల్ లక్ష్మణ, సిబ్బంది రాంప్రసాద్‌రెడ్డి, వెంకటనారాయణ పాల్గొన్నారు.



క్రీడా సామగ్రి అందజేస్తున్న శాంతమ్మ

విశ్రాంత

ప్రధానోపాధ్యాయుడి మృతి

తాడిమర్రి, ఆగస్టు 24: విశ్రాంత ప్రధానోపాధ్యాయుడు మల్లప్పగారి నాగిరెడ్డి (74) శనివారం మృతిచెందాడు. నేత్రదానానికి సంబంధించి డాక్యుమెంట్లను సమర్పించి ఉండటంతో ఎల్‌వీ ప్రసాద్ కంటి ఆస్పత్రి టెక్నీషియన్ లక్ష్మణ్ కళ్లను సేకరించారు.

జీఓ నంబరు 84ను రద్దుచేయాలి

మున్సిపల్ ఉపాధ్యాయుల డిమాండ్

ధర్మవరం, ఆగస్టు 24: విద్యావ్యవస్థను నిర్వీర్యం చేస్తున్న జీఓ నెంబరు 84ను రద్దుచేయాలని మున్సిపల్ ఉపాధ్యాయులు డిమాండ్‌చేశారు. శనివారం ఎమ్మార్సీ కార్యాలయంలో ఎంఈఓ-1, 2 రాజేశ్వరి, గోపాల్‌నాయక్‌లకు వారు శనివారం వినతిపత్రం అందజేశారు. అనంతరం ఏపీఎంటీఎఫ్ గౌరవాధ్యక్షుడు రాంప్రసాద్, రాష్ట్ర కార్యదర్శి రామ్మోహన్ మాట్లాడుతూ సంవత్సరాలు గడుస్తున్నా పదోన్నతులు, బదిలీలు లేకుండా కాలం వెళ్లతీస్తున్నారన్నారు. మున్సిపల్ ఉపాధ్యాయులను విద్యాశాఖ ద్వితీయశ్రేణి ఉపాధ్యాయులుగా పరిగణిస్తోందన్నారు. మున్సిపాలిటీలోని మాధ్యమిక, ఉన్నత పాఠశాలలకు శాంక్షన్ పోస్టులు కేటాయించాలన్నారు. కార్యక్రమంలో ప్యాప్టో పట్టణ కార్యదర్శులు రవీంద్రారెడ్డి, రామకృష్ణ, నాగప్ప, ఉమాపతి, జగదీశ్, సాయిగణేశ్ ఉన్నారు.



ఎంఈఓలకు వినతిపత్రం అందజేస్తున్న మున్సిపల్ ఉపాధ్యాయులు

లైంగిక బాధితులను చులకనగా చూడరాదు

న్యాయవిజ్ఞాన సదస్సులో వక్తలు

కదిరిలీగల్, ఆగస్టు 24: ఏ కారణం చేతనైనా లైంగిక వేధింపులకు గురైన బాధితులను చులకనగా చూడరాదని పలువురు వక్తలు పేర్కొన్నారు. మండల న్యాయసేవాధికార సంస్థ, ప్రతిభ మైత్రి మహిళా సేవా సంఘం ఆధ్వర్యంలో శనివారం న్యాయవిజ్ఞాన సదస్సు నిర్వహించారు. స్థానిక ఏరియా ఆస్పత్రి వైద్యాధికారి డాక్టర్ హుస్సేన్, పట్టణ ఎస్ఐ బాబ్జాన్, సంఘం ప్రతినిధులు విశ్వతేజ, రాజేశ్వరి ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. ఈ సందర్భంగా లైంగిక బాధితులకు చట్టంలో ఉన్న రక్షణ వ్యవస్థల గురించి వివరించారు. లైంగిక దోపిడీకి గురైన వారిని హేళన చేస్తే తీవ్ర పరిణామాలు ఉంటాయని సుప్రీంకోర్టు హెచ్చరించిన విషయాన్ని తెలియజేశారు.



మాట్లాడుతున్న వైద్యాధికారి హుస్సేన్

ఆంజనేయస్వామికి శ్రావణమాస పూజలు




పెనుకొండ ఊరువాకిలి ఆంజనేయస్వామి, సంజీవరాయస్వామి




చందకచర్ల ఆంజనేయస్వామి, రామాపురంలో అలంకరణ

పెనుకొండ, ఆగస్టు 24 : శ్రావణమాసం మూడో శనివారం సందర్భంగా పట్టణంలోని ప్రాచీన దేవాలయాలైన లక్ష్మీ వెంకటరమణ స్వామి, ఊరువాకిలి ఆంజనేయస్వామి, సంజీవరాయస్వామి ఆలయాల్లో అర్చకులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయాలు భక్తులతో కిటకిటలాడాయి. అతి

మడకశిర రూరల్: మండలంలో ప్రసిద్ధిచెందిన చందకచర్ల, జిల్లేడగుంట, మణూరు ఆంజనేయస్వామి ఆలయాల్లో ఉదయం నుంచి ప్రత్యేక పూజలు నిర్వహించారు. మొక్కుబడి ఉన్న భక్తులు స్వామి వారికి ఆకు పూజ చేయించారు.

అగళి: మండలపరిధిలోని రామాపురం, రావుడి కోడిపల్లి, అగళి, హెచ్‌డీ హళ్లి, ఆంజనేయ స్వామి దేవాలయంలో ప్రత్యేక పూజలు, తీర్థప్రసాద వినియోగం, అన్నదాన కార్యక్రమం చేపట్టారు. అగళిలో వెలసిన శనిమహాత్ముడి దేవాలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయాలు భక్తులతో కిటకిటలాడాయి.

గుడిబండ: మండలంలోని ఎస్ రాయాపురం, కొంకల్లు, కురుబరపల్లి, బీటీపల్లి, హిరేతుర్పి తదితర గ్రామాల్లో వెలసిన ఆంజనేయస్వామికి శనివారం భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఎస్ రాయాపురంలో మహిళలు స్వామివారికి హారతులు మోసి మొక్కులు తీర్చుకున్నారు. అనంతరం అన్నదానం చేశారు.




ఎస్ రాయాపురంలో ఆంజనేయస్వామి, కొంకల్లు ఆంజనేయస్వామి

షిర్డీసాయి మందిరంలో ఏకాహం

హిందూపురం అర్బన్, ఆగస్టు 24: పట్టణ పరిధిలోని షిర్డీసాయి నగర్‌లో వెలసిన షిర్డీ సాయిబాబా మందిరంలో 24 గంటల సేపు నిరంతరాయంగా బాబా నామస్మరణ చేపట్టారు. మందిరంలో శనివారం ఉదయం 6 గంటల నుంచి ఆదివారం ఉదయం 6 గంటల వరకు ఏకాహం చేపట్టారు. ఈ సందర్భంగా మూలవిరాట్‌కు అభిషేకాలు, అర్చనలు చేశారు. భక్తులు మూడు బృందాలుగా ఏర్పడి భజనలు చేస్తున్నారు.

గురుకులాల్లో ప్రవేశానికి దరఖాస్తుల ఆహ్వానం

గోరంట్ల, ఆగస్టు 24: పెనుకొండ, గోరంట్ల పట్టణాల్లోని గిరిజన బాలికల గురుకుల పాఠశాలల్లో ఖాళీగా ఉన్న సీట్లకోసం ఈ నెలాఖరులోగా దరఖాస్తు చేసుకోవాలని గోరంట్ల గురుకుల పాఠశాల ప్రిన్సిపాల్ విజయ్‌కుమార్ శనివారం ఓ ప్రకటనలో తెలిపారు. తరగతుల వారీగా ఖాళీల వివరాలు ఇలా ఉన్నాయి. గోరంట్ల గిరిజన బాలికల పాఠశా లలో నాలుగో తరగతిలో 30, ఐదులో 21, ఆరులో ఒకటి, ఏడులో 10, ఎనిమిదిలో 2, తొమ్మిదో తరతగతిలో 10 ఖాళీలున్నాయి. పెనుకొండ గురుకుల పాఠశాలలో నాలుగో తరగతి 30, ఐదులో 24, ఆరు లో 18, ఏడులో 7, ఎనిమిదిలో 10, తొమ్మిదో తరగతిలో 16 సీట్లు ఖాళీ ఉన్నాయని తెలిపారు. అర్హులైన గిరిజన బాలికలు ఆయా పాఠశాలల్లో దరఖాస్తు చేసుకోవాలని కోరారు.

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

హిందూపురం అర్బన్, ఆగస్టు 24: విద్యుత్ 11 కేవీ లైన్‌లో మరమ్మతుల కారణంగా ఆదివారం పట్టణంలో విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడనున్నట్లు విద్యుత్ శాఖ ఏఈఈ నాగన్న ఓ ప్రకటనలో పేర్కొన్నారు. ఈ సందర్భంగా పట్టణంలోని డీబీ కాలనీ, బీఆర్ కాలనీ, లక్ష్మీపురం, నానెప్పనగర్, శ్రీకంఠపురం, మోడల్‌కాలనీ, ఆబద్‌పేట, ధర్మపురం, ముక్కడిపేటలో ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు విద్యుత్ సరఫరా ఉండదన్నారు. ప్రజలు గమనించి వినియోగదారులు సహకరించాలని కోరారు.

సీసీ కెమెరాలను వినియోగంలోకి తెస్తాం: డీఎస్పీ

హిందూపురం/ చిలమత్తూరు, ఆగస్టు 24 : సబ్‌డివిజన్ పరిధిలో అన్నిచోట్ల పోలీస్‌శాఖ ఏర్పాటుచేసిన సీసీ కెమెరాల పనితీరును పూర్తిస్థాయిలో వినియోగంలోకి తెచ్చేందుకు చర్యలు చేపడతామని హిందూపురం డీఎస్పీ కేవీ మహేష్ పేర్కొన్నారు. ఆయన శనివారం రాష్ట్ర సరిహద్దులోని తూముకుంట, కొడికొండ చెక్‌పోస్టులతోపాటు లేపాక్షి, చిలమత్తూరు, పట్టణంలో సీసీ కెమెరాల పనితీరును తనిఖీ చేశారు. సబ్ డివిజన్‌లోని సీఐలతో సమీక్ష జరిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... అన్ని సీసీ కెమెరాలు పనిచేస్తే నేరాల నియంత్రణ సులభతరం అవుతుందన్నారు. అంతేకాకుండా ఏదైనా నేరం జరిగినప్పుడు నిందితులను పట్టుకునేందుకు ఆస్కారం ఉంటుందన్నారు. సబ్ డివిజన్ పరిధిలో మరికొన్ని సీసీ కెమెరాలు ఏర్పాటు చేసి వాటికి సంబంధించిన కంట్రోల్ రూమ్‌ను హిందూపురంలో ఏర్పాటుచేసేందుకు ఉన్నతాధికారులను కోరుతామన్నారు. అలా చేస్తే నేరం జరిగినప్పుడు త్వరితగతిన నిందితుడిని పట్టుకోవచ్చన్నారు. సీసీ కెమెరా ఉంటే సిబ్బందిలో కూడా భయం ఉంటుందని విధుల్లో జాగ్రత్తగా వ్యవహరిస్తారన్నారు. డీఎస్పీ వెంట సీఐలు ఆంజనేయులు, జనార్దననాయుడు, ఎస్ఐ మున్నీర్ అహమ్మద్ సిబ్బంది పాల్గొన్నారు.

విద్యార్థిని ఆత్మహత్యాయత్నం

హిందూపురం(పరిగి), ఆగస్టు 24: మండలానికి చెందిన ఇంటర్మీడియట్ మొదటి సంవత్సరం చదువుతున్న ఓ విద్యార్థిని ఆత్మహత్యాయత్నానికి పాల్పడింది. ఆమెకు తరచూ తలనొప్పి వస్తుండేది. ఈ తరుణంలో శనివారం మధ్యాహ్నం తలనొప్పి తీవ్రం కావడంతో మనస్థాపానికి గురై ఇంట్లో ఉరివేసుకుని ఆత్మహత్యాయత్నానికి పాల్పడింది. కుటుంబ సభ్యులు గమనించి ఆమెను హిందూపురం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. ఉన్నత వైద్యం కోసం బెంగళూరుకు తరలించారు.

ద్విచక్రవాహనం నుంచి పడి అంగన్‌వాడీ కార్యకర్త మృతి

హిందూపురం అర్బన్, ఆగస్టు 24: మండల పరిధిలోని కె నరసాపురంలో ప్రమాద వశాత్తు దివచక్రవాహనంపై నుంచి కిందపడి అంగన్‌వాడీ కార్యకర్త మృతి చెందింది. ఆమె శనివారం ఉదయం స్వగ్రామంలో ద్విచక్రవాహనంలో వస్తూ ప్రమాద వశాత్తు కిందపడింది. అపస్మారక స్థితిలో ఉన్న ఆమెను ఆమె కుమారుడు హిందూపురం ప్రభుత్వ ఆసుపత్రికి ఆటోలో తీసుకెళ్లాడు. వైద్యులు పరిశీలించి అప్పటికే మృతి చెందినట్లు ధ్రువీకరించారు. అంగన్‌వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ అసోసియేషన్ హిందూపురం ప్రధాన కార్యదర్శి లావణ్య, ఉమాదేవి, పద్మ, జయమ్మ తదితరులు పలువురు సంతాపం తెలిపారు.

కనులపండువగా ఏడుకొండల స్వామి వ్రతం



పూజలు చేయిస్తున్న ఎమ్మెల్యే, మాజీ ఎమ్మెల్సీ



వ్రతంలో పాల్గొన్న గుండుమల తిప్పేస్వామి, పట్టణ వాసులు

మడకశిరటౌన్, ఆగస్టు 24 : పట్టణంలోని అయ్యప్పస్వామి దేవాలయంలో శనివారం ఉదయం నుంచి శ్రావణమాసం పురస్కరించుకొని ఏడు కొండల స్వామి వ్రతాన్ని కన్నుల పండువగా నిర్వహించారు. వేద పండితుల మంత్రోచ్చారణ మధ్య వైభవంగా సాగింది. పట్టణం నుంచే కాకుండా చుట్టుపక్కల గ్రామాల నుంచి భక్తులు తరలివచ్చారు. ఉదయం 6 గంటల నుంచి గణపతి పూజ, గంగపూజ, గోపూజా తదితర కార్యక్రమాలు నిర్వహించారు. ఉదయం 10 10.30 గంటలకు ఏడు శనివారాల వ్రతాన్ని ఘనంగా నిర్వహించారు. మధ్యాహ్నం ఒంటి గంటకు అయ్యప్పస్వామికి ప్రత్యేక పూజలు జరిగాయి. ఎమ్మెల్యే ఎంఎస్ రాజు, టీడీపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు గుండుమల తిప్పేస్వామి, రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి రాధాకృష్ణ తదితరులు ఏడు కొండల స్వామి వ్రతంలో పాల్గొని పూజ కార్యక్రమాలు నిర్వహించారు.

సమస్య రాకముందే జాగ్రత్తలు తీసుకోవాలి

● అధికారులకు ఎమ్మెల్యే ఎంఎస్ రాజు సూచన



సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే

మడకశిరటౌన్, ఆగస్టు 24 : సమస్య వచ్చినప్పుడు స్పందించడం కాదని, ముందే జాగ్రత్తలు తీసుకోవాలని ఎమ్మెల్యే ఎంఎస్ రాజు అన్నారు. ఆయన శనివారం స్థానిక ఆర్ అండ్‌బీ అతిథి గృహం ఆవరణంలో వైద్య ఆరోగ్య శాఖ, ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులు, ఎం పీడీఓలతో ప్రత్యేక సమీక్షా సమావేశాన్ని నిర్వహించారు. నియోజకవర్గం పరిధిలోని కొంకల్లు, ఎం రాయాపురంలో డయేరియా ప్రబలిందని, అయితే వైద్య ఆరోగ్య శాఖ, ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులు, ఇతర అధికారులతో సమన్వయం చేసుకుంటూ సమస్య పరిష్కారానికి చొరవ చూపడం హర్షణీయమన్నారు. అయితే ఇలాంటి సమస్యలు పునరావృతం కాకుండా పటిష్ట చర్య లు చేపట్టాలని అధికారులను ఆదేశించారు. మడకశిర నియోజకవర్గవ్యాప్తంగా ఈనెల 27, 28 తేదీల్లో స్పెషల్ డ్రైవ్ నిర్వహించి పైప్‌ల మరమ్మతులకు యుద్ధ ప్రాతిపదికన చర్యలు చేపట్టాలన్నారు. అదేవిధంగా నియోజకవర్గంలో ప్రతి ఇంటికి కొళాయి ఏర్పాటుకు అన్ని చర్యలు తీసుకుంటున్నామని, అధికారులు అందుకు అనుగుణంగా పనులు చేయాలని సూచించారు. ఈసందర్భంగా ఆర్‌డబ్ల్యూఎస్ ఎస్‌ఈ మల్లికార్జున్ మాట్లాడుతూ... జిల్లా వ్యాప్తంగా 3.60లక్షల కొళాయి కనెక్షన్లు ఇచ్చేందుకు అన్ని ఏర్పాట్లు చేస్తున్నామని, అవసరమైతే మరోలక్ష కొళాయి కనెక్షన్లు అందించేందుకు చర్యలు తీసుకుంటామన్నారు. మడకశిర నియోజకవర్గం వ్యాప్తంగా మరో ఆరేడు నెలల్లో ప్రతి ఇంటికి కొళాయి అందించే విధంగా చర్యలు చేపడుతామని తెలిపారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ..... గత ప్రభుత్వంలో శ్రీరామరెడ్డి తాగునీటి పథకం ద్వారా నీరు సరఫరా చేయకుండా, నిధులు స్వాహా చేశారని అన్నారు. శ్రీరామరెడ్డి నీటి సరఫరాకు నియోజకవర్గానికి సంబంధించి రూ.3కోట్లు అందిస్తున్నా ఆ ఉద్దేశం నెరవేరడం లేదని, ఇప్పటికైనా అధికారులు నాణ్యమైన తాగునీటిని అందిం చేందుకు చర్యలు చేపట్టాలని సూచించారు. వేసవి కాలంలో ఏ ఒక్క గ్రామంలోనూ తాగునీటి సమస్య ఉండకూడదన్నారు. ఈ కార్యక్రమంలో డీఎంఅండ్ హెచ్‌ఓ మంజువాణి, ఆర్‌డబ్ల్యూఎస్ డీఈ మనూనాయక్, ఎంపీడీఓలు సోనీబాయి, ప్రసాద్, రామారావు, భాస్కర్, డాక్టర్లు శాంతి, ఐదు మండలాల ఇంజనీర్లు తదితరులు పాల్గొన్నారు.

మంత్రిని కలిసిన ఎమ్మెల్సీ బీటీ నాయుడు



మంత్రి సవితకు పుష్పగుచ్ఛం అందజేస్తున్న బీటీ నాయుడు

పెనుకొండ రూరల్, ఆగస్టు 24 : బీసీ సంక్షేమం, చేనేత జౌళిశాఖ మంత్రి సవితను ఎమ్మెల్సీ బీటీ నాయుడు మర్యాద పూర్వకంగా కలిశారు. ఆయన శనివారం మంత్రిని పెనుకొండ లోని ఆమె క్యాంపు కార్యాలయంలో కలిసి పుష్పగుచ్ఛం అందజేశారు. ఈ కార్యక్రమంలో మాజీ జడ్పీటీసీ నారాయణస్వామి, సర్పంచ్ శ్రీనివాసులు, గోపాల్, టీడీపీ నాయకులు పాల్గొన్నారు.

వెటరన్ జర్నలిస్టుల సమస్యలు సీఎం దృష్టికి తీసుకెళ్తా

మంత్రి సవిత

పెనుకొండ, ఆగస్టు 24 : వెటరన్ జర్నలిస్ట్‌ల సమస్యలను ముఖ్యమంత్రి చంద్రబాబు దృష్టికి తీసుకెళ్లి పరిష్కారానికి కృషిచేస్తానని బీసీ సంక్షేమం, చేనేత జౌళిశాఖల మంత్రి సవిత తెలిపారు. ఉభయజిల్లాలకు చెందిన వెటరన్ జర్నలిస్ట్‌లు శనివారం మంత్రిని ఆమె స్వగృహంలో కలిసి వినతిపత్రాన్ని అందించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ... వెటరన్ జర్నలిస్ట్‌లకు ఇంటిపట్టాలు, పింఛన్, రాష్ట్ర ఉచిత బస్సు పాసు సౌకర్యం కల్పించాలని, హెల్త్‌కార్డులు మంజూరు చేయాలనే పలు సమస్యలను వివరించారు. ఆమె స్పందిస్తూ రాష్ట్రంలో వీటిని ముఖ్యమంత్రి దృష్టికి తీసుకెళతానని తెలిపారు. వెటరన్ జర్నలిస్ట్‌ల సంఘం అధ్యక్షుడు బాబ్జాన్, ప్రధాన కార్యదర్శి జయరాంరెడ్డి, ట్రెజరర్ జాకబ్, బాబిశెట్టి, అంజినప్ప, మాళప్ప, పరిగి నారాయణ, కళ్యాణదుర్గం లింగప్రసాద్, అనంతపురం ఆనందవర్ధన్, నాగరాజు, హిందూపురం రామస్వామి, అమరాపురం తిప్పన్న తదితరులు పాల్గొన్నారు.

కృష్ణాష్టమి వేడుకలకు ఆలయాలు ముస్తాబు

పెనుకొండ, ఆగస్టు 24: కృష్ణాష్టమి వేడుకల నిర్వహణకు పట్టణంలోని వేణుగోపాలస్వామి ఆలయాలు ముస్తాబవుతున్నాయి. సోమవారం కృష్ణాష్టమి పురస్కరించుకుని పట్టణంలోని పురాతన ఆలయాలైన వేణుగోపాలస్వామి ఆలయం, బోయపాళ్యంలోని కృష్ణస్వామి దేవాలయాల్లో యాదవ సంఘం ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు నిర్వహించనున్నట్లు అర్చకులు రామకృష్ణాచార్యుల తెలిపారు. అనంతరం చిన్నికృష్ణుడి వేషధారణలో చిన్నారుల ఊరేగింపు, ఉట్టికొట్టడం, స్వామివారి ఉత్సవ విగ్రహాల ఊరేగింపు, సాయంత్రం ఉయ్యాలసేవ, భజన కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు కమిటీ సభ్యులు తెలిపారు. కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా బీసీ సంక్షేమం, చేనేత జౌళిశాఖ మంత్రి సవిత, హిందూపురం ఎంపీ బీకే పార్థసారథి పాల్గొంటారన్నారు.

హిందూపురం అర్బన్: పట్టణ పరిధిలోని వేణుగోపాల స్వామి ఆలయంలో సోమవారం గోకులాష్టమి వేడుకలు నిర్వహించనున్నట్లు ఆలయ ఈఓ నరసింహరాజు తెలిపాడు. ఆదివారం ఉదయం ప్రత్యేక పూజలు, ప్రాకారోత్సవం నిర్వహిస్తాన్నారు. అనంతరం 10 గంటలకు రుక్మిణీ సత్యభామ సమేత వేణుగోపాలస్వామి తిరుకళ్యాణోత్సవం, మధ్యాహ్నం ఒంటి గంటకు రథోత్సవం నిర్వహిస్తామన్నారు. 27వ తేదీ మంగళవారం ఉదయం వసంతోత్సవం, సాయంత్రం 6 గంటలకు ఉ య్యాలోత్సవం ఉంటుందన్నారు. బుధవారం 6.30 గంటలకు నిత్యారాధన ఉంటుందన్నారు. భక్తులు పెద్ద సంఖ్యలో తరలిరావాలని కోరారు.

భక్తిశ్రద్ధలతో సుబ్రహ్మణ్యేశ్వర స్వామి కల్యాణం

పెనుకొండ, ఆగస్టు 24 : శ్రావణ మాసం పురస్కరించుకుని వేద బ్రహ్మ పంచాంగం నాగప్రసాద్ శర్మ ఆధ్వర్యంలో సుబ్రమణ్యేశ్వర స్వామి కళ్యాణోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. నాగప్రసాద్ శర్మ ఇంటి వద్ద వేద పండితులు శివకుమార్ దంపతులచేత శనివారం రాత్రి కల్యాణోత్సవాన్ని జరిపించారు. పెద్ద సంఖ్యలో ప్రజలు పాల్గొన్నారు.

ఐదేళ్లూ ఇబ్బందులు పడ్డాం

సమస్యలు పరిష్కరించాలని ఎమ్మెల్యేకి వినతి

మడకశిరటౌన్, ఆగస్టు 24: నగర పంచాయతీ పరిధిలోని చౌటిపల్లి కాలనీలో ఐదేళ్లుగా తాగునీటి సమస్య, వీధి దీపాలు, మౌలిక వసతులపై ప్రజా ప్రతినిధులు, అధికారులకు ఎన్ని విన్నపాలు చేసినా పరిష్కారం చూపలేదని కాలనీ వాసులు ఎమ్మెల్యే ఎంఎస్ రాజు వద్ద మొరపెట్టుకొన్నారు. ఎమ్మెల్యే శనివారం అటువైపుగా వెళ్తుండగా కాలనీలో రోడ్డుపక్కనే నిలబడి ఉన్న మహిళలు వాహనాన్ని ఆపారు. తమ సమస్యలు చెప్పాలని నిలబడి ఉన్నట్లు తెలిపారు. గత ఐదేళ్ల వైసీపీ పాలనలో వారు పడిన ఇబ్బందులు ఎమ్మెల్యేకి వివరించారు. వెంటనే స్పందించిన ఎమ్మెల్యే ఆదివారం ఉదయం అధికారులతో కలిసి కాలనీలో పర్యటిస్తామని, అన్ని సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని భరోసా ఇచ్చారు. దీంతో కాలనీ వాసులు సంతోషం వ్యక్తం చేశారు.

117, 84 జీఓలను రద్దు చేయాలి

రూటా డిమాండ్


గోరంట్ల, ఆగస్టు 24: రాష్ట్రంలో ప్రాథమిక విద్యావ్యవస్థను నాశనం చేస్తున్న జీఓలు 117, 84ను వెంటనే రద్దు చేయాలని రూటా నాయకులు ప్రభుత్వాని డిమాండ్ చేశారు. ఈ మేరకు రాష్ట్ర ఉర్దూ టీచర్స్ అసోషియేషన్ (రూటా) అధ్యక్ష, ప్రధానకార్యదర్శులు ఇమామ్‌బాషా, సయ్యద్ ఇక్బాల్, రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ ఫైరోజ్ అహమ్మద్ శనివారం ఓప్రకటనలో పేర్కొన్నారు. జీఓ 117ను రద్దు చేసి రాష్ట్రంలోని ప్రతి ప్రాథమిక పాఠశాలను 1నుంచి 5తరగతుల వరకు నిర్వహించాలన్నారు. సర్దుబాటు ప్రక్రియ నిలిపివేసి, ఖాళీగా ఉన్న ఉన్నత పాఠశాలల్లో హెచ్‌ఎంలు, స్కూల్ అసిస్టెంట్ పోస్టులు భర్తీ చేయాలని కోరారు. గత 50యేళ్లలో మున్సిపల్ పాఠశాలల వ్యవస్థ ఎంతో అభివృద్ధి చెందిందన్నారు అయితే గత వైసీపీ ప్రభుత్వం జీఓ 84తో వాటి మనుగడ ప్రశ్నార్థకంగా మారిపోయిందన్నారు. ఆ జీఓను రద్దు చేసి, గత టీడీపీ ప్రభుత్వం పురపాలక శాఖమంత్రి నారాయణ పాలనలో జరిగిన విధంగా అమలు చేయాలని ప్రభుత్వాన్ని కోరారు.

బాల్యవివాహాలు చేస్తే చర్యలు : సీడీపీఓ


పెనుకొండ రూరల్, ఆగస్టు 24 : బాల్య వివాహాలు చేస్తే కఠిన చర్యలు తప్పవని సీడీపీఓ శాంతలక్ష్మి తెలిపారు. రొద్దం మండలంలోని జడ్పీ ఉన్నత పాఠశాలలో శనివారం ఆర్డీటీ ఆధ్వర్యంలో బాలికలను రక్షిద్దాం, చదివిద్దాం అనే కార్యక్రమాన్ని నిర్వహించారు. అక్కడ ఏర్పాటు చేసిన సమావేశంలో సీడీపీఓ మాట్లాడుతూ.. ఆడపిల్లలు బాగా చదు వుకోవాలన్నారు. బాల్యవివాహాలు చేస్తే అమ్మాయి మానసిక, శారీరక ఒత్తిడికి గురయ్యే ప్రమాదం ఉందన్నారు. ఎవరైనా బాల్య వివాహాలు చేయాలని చూస్తే టోల్ ఫ్రీ నంబర్లు 1098, 100, 112కు సమాచారం అందించాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆర్డీటీ రీజనల్ డైరెక్టర్ మల్లికార్జున, సిబ్బంది ఆదినారాయణ, టీమ్‌లీడర్ ఆదినారాయణ, కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్ ప్రమీళమ్మ, ఐసీడీఎస్ సూపర్‌వైజర్ సుజాత, పాఠశాల ప్రధానోపాధ్యాయుడు ముజఫ్ఫర్ హుస్సేన్, ఉపాధ్యాయులు రాజేశ్వరి తదితరులు పాల్గొన్నారు.

అంధకారంలో 37వ వార్డు

హిందూపురం, ఆగస్టు 24: పట్టణంలోని ముద్దిరెడ్డిపల్లిలో 15రోజులుగా వీధి దీపాలు వెలుగకపోవడంతో అంధకారం నెలకొంది. దీంతో ఆ ప్రాంత జనం తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. పలుమార్లు మునిసిపల్ అధికారులకు స్థానిక కౌన్సిలర్ మహాలక్ష్మి విన్నవించినా ఫలితం లేదు. రాత్రిపూట బయటికి వెళ్లాలంటే స్థానికులు జంకుతున్నారు. ముఖ్యంగా చిన్నారులు, వృద్ధులు చీకటి పడితే బయటికి వెళ్లడానికి ఇబ్బందిగా మారింది. సొంత డబ్బుతో ఏర్పాటు చేసుకుంటామని కోరినా మునిసిపల్ అధికారులు పట్టించుకోలేదని కౌన్సిలర్ ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పటికైనా ఆ ప్రాంతంలో వీధిదీపాలు ఏర్పాటు చేయాలని కౌన్సిలర్‌తో పాటు ఆ ప్రాంతవాసులు కోరుతున్నారు.




ఎన్టీఆర్ కాలనీ సడ్లపల్లి అంగన్‌వాడీ కేంద్రంలో...



ఈశ్వర్ పాఠశాలలో...

కృష్ణాష్టమి వేడుకలు

హిందూపురం అర్బన్, ఆగస్టు 24: పట్టణంలోని పలు పాఠశా లలు, అంగన్‌వాడీ కేంద్రాల్లో ముందస్తు కృష్ణాష్టమి వేడుకలను శనివా రం ఘనంగా నిర్వహించారు. చిన్నారులు కన్నయ్య, గోపికల వేషధారణలతో ఆకట్టుకు న్నారు. ఉట్టి కొట్టే కార్యక్రమంలో చిన్నారులు అలరించారు. ఆటపాటలతో సందడి చేశారు. ఉపాధ్యాయులు సాంప్రదాయ దుస్తులు ధరించి వేడుకల్లో పాల్గొన్నారు. పట్టణ పరిధిలోని పంచజన్య పాఠశాలలో నృత్యాలు చేసి ఉట్టి కొట్టే కార్యక్రమం, కోలాటం నిర్వహించారు. పట్టణంలోని ఎన్‌టీఆర్ కాలనీ సడ్లపల్లి పాఠశాలలో, ఈశ్వర్ ఇంగ్లీష్ మీడియం పాఠశాలలో చిన్నారుల వేషధారణలు ఆకట్టుకున్నాయి.



పాంచజన్య పాఠశాలలో...

పావగడకు పోటెత్తిన భక్తులు




శనీశ్వరుడిని దర్శించుకుంటున్న భక్తులు, అలంకరణలో శీతలాంబ



మహాత్ముడి దర్శనం కోసం క్యూలో నిలిచిన భక్తులు

పావగడ, ఆగస్టు 24 : పట్టణంలో ప్రసిద్ధిచెందిన శనీశ్వరుడి ఆలయానికి శ్రావణమాస మూడో శనివారం సందర్భంగా భక్తులు పోటెత్తారు. తెల్లవారుజామున 4.30కే జరిగిన తొలి పూజ, నవగ్రహ తైలాభిషేకానికి భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చారు. మహిళలు శీతలాంబకు కుంకుమార్చన చేయించారు. శనీశ్వరుడికి ఇష్టమైన నల్లనువ్వులు, నల్లగుడ్డలు అగ్నిగుండంలో వేసి, ప్రదక్షిణ చేసి శనిమహాత్మా మా జోలికి రావద్దని వేడుకున్నారు. తమ వెన్ను శనీశ్వరుడికి చూపకుండా తిరిగి వెళ్లారు. ఉదయం నుంచి సాయంత్రం వరకు దాదాపు 50వేల మంది భక్తులు స్వామివారిని దర్శించుకున్నట్లు ఆలయ కమిటీ డైరెక్టర్ కేవీ శ్రీనివాస్, ప్రధాన అర్చకులు సత్యనారాయణ శాస్త్రి తెలిపారు.

ఏకపక్షంగా మట్టికి అనుమతులు

ఇరిగేషన్ డీఈపై సభ్యుల ఆగ్రహం



ఇరిగేషన్ డీఈని ప్రశ్నిస్తున్న స్థానిక ప్రజాప్రతినిధులు

హిందూపురం(పరిగి), ఆగస్టు 24 : మట్టి అనుమతులపై ఇరిగేషన్ డీఈ ఏకపక్షంగా వ్యవహరిస్తున్నారని సర్వసభ్య సమావేశంలో సభ్యులు ఆగ్రహం వ్యక్తం చేశారు. పరిగి మండల పరిషత్ కార్యాలయంలో శనివారం ఎంపీడీఓ సరస్వతి అధ్యక్షతన సాధారణ సర్వసభ్య సమావే శాన్ని నిర్వహించారు. పరిగి చెరువులో నుంచి ఇటుక బట్టీలకు మట్టితోలుకునేందుకు ఇరిగేషన్ డీఈ లక్ష్మీనారాయణ తనకు అనుకూలంగా ఉన్నవారికి మాత్రమే అనుమతులు ఇస్తున్నారని, ఇది 15రోజుల నుంచి జరుతోందని ఆపించారు. చెరువు నుంచి మట్టి తోలుకునేందుకు పెనుకొండ ఇరిగేషన్ కార్యాలయం చుట్టూ తాము తిరుగుతున్నా ఏదో ఒక సాకుతో అనుమతులు ఇవ్వడం లేదని మండలానికి చెందిన కొందరు ఇటుకబట్టీల నిర్వాహకులు తమ వద్ద ఆవేదన వ్యక్తం చేశారని అన్నారు. ఈ విషయంపై ఎన్నిమార్లు ఫోన్‌చేసినా ఎందుకు స్పందించడంలేదని డీఈని నిలదీశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. తాను పైఅధికారులకు విషయం తెలిపి న తరువాతే అనుమతులు మంజూరు చేస్తాన్నానని తెలిపారు. ఇకనైనా అందరికీ సమానంగా అనుమతులు మంజూరు చేయాలని ప్రత్యేకాధికారి ప్రసాద్‌రావు, ఎంపీడీఓ సరస్వతి సూచించారు. అలాగే బీచిగానిపల్లి పంచాయతీ పరిధిలో ఐదునెలలుగా ఐదు పశువులు చనిపోయినాయని, పశువులకు వైద్యం చేయడంలో పశువైద్యాధికారి గీత నిర్లక్ష్యం వహిస్తున్నారని సర్పంచ్ బాలాజీ ఆరోపించారు. ఇకనైనా వైద్యులు పశువులకు సక్రమంగా వైద్యచికిత్సలు నిర్వహించాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ సవిత, సర్పంచులు, ఎంపీటీసీ సభ్యులు, అధికారులు పాల్గొన్నారు.

ప్రకృతి వ్యవసాయానికి సహకారం

పెనుకొండ రూరల్, ఆగస్టు 24 : మండలంలోని శెట్టిపల్లిలో ప్రకృతి వ్యవసాయం చేస్తున్న ఎస్సీ రైతులకు ఉచితంగా డ్రమ్ములు అందజేసినట్లు ఎస్సీ కార్పొరేషన్ ఈడీ సారయ్య శనివారం తెలిపారు. కార్పొరేషన్ ద్వారా ఒక్కొక్కరికి రెండు డ్రమ్ములు, తార్పాలిన్ పట్ట చొప్పున అందజేశారు. టీడీపీ మండల కన్వీనర్ సిద్దయ్య, ఎస్సీ కార్పొరేషన్ సిబ్బంది, ఎన్ఎఫ్ఏ సాకప్ప, న్యాచురల్ ఫార్మింగ్ అసోసియేషన్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

'బీజేపీని బలోపేతం చేద్దాం'

పెనుకొండ రూరల్, ఆగస్టు 24: పట్టణ, గ్రామీణ ప్రాంతాల్లో బీజేపీని బలోపేతం చేద్దామని ఆ పార్టీ జిల్లా కార్యదర్శి ఎనుమల రామకృష్ణ పేర్కొన్నారు. బీజేపీ రాష్ట్ర అధ్యక్షురాలు పురందేశ్వరి, జిల్లా అధ్యక్షుడు జీఎం శేఖర్ ఆధ్వర్యంలో త్రిపుర రిసార్ట్ అధినేత గోపీనాథ్ బీజేపీలో చేరారు. ఈ నేపథ్యంలోనే శనివారం పట్టణంలోని పార్టీ కార్యాలయంలో బీజేపీ నాయకులు గోపీనాథ్‌ను సన్మానించారు. కార్యక్రమంలో బీజేపీ నాయకులు అంగడి రామాంజినేయులు, జయరాంయాదవ్, రవి, బాలగోపాల్, మధు, సోమశేఖర్, హనుమంతు, హరీనాయక్ తదితరులు పాల్గొన్నారు.

పోక్సోపై విద్యార్థులకు అవగాహన

మడకశిర(అమరాపురం), ఆగస్టు 24: అమరాపురం మండల పరిధిలోని హలుకూరు సమీపంలో ఉన్న డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ గురుకుల పాఠశాలలో శనివారం విద్యార్థులకు పోక్సో చట్టంపై అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. కళాశాల ప్రిన్సిపాల్ పద్మావతి అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో ముఖ్యఅతిథిగా పాల్గొన్న ఎస్ఐ జనార్ధన్‌నాయుడు మాట్లాడారు. ఏఎస్ఐ రామాంజనేయులు, పాఠశాల సిబ్బందిపాల్గొన్నారు.

మల్బరీ షెడ్డును పరిశీలించిన అధికారులు

మడకశిర(అమరాపురం), ఆగస్టు 24: అమరాపురం మండలంలోని హలుకూరులో మల్బరీ షెడ్డును శనివారం ఎంపీడీఓ భాస్కర్, జేఈ జగదీష్ పరిశీలించారు. మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం కింద రాష్ట్ర ప్రభుత్వం ప్రోత్సహిస్తోందని రైతులు సద్వినియోగం చేసుకోవాలని తెలిపారు. ఈమల్బరీ షెడ్డుకు ఉపాధి హామీ పథకంలో రూ.3లక్షలను మంజూరు చేశారు. ఈకార్యక్రమంలో ఎంపీడీఓ భాస్కర్, ఉపాధి హామీ జేఈ జగదీష్, టెక్నికల్ అసిస్టెంట్ హనుమంతరాయప్ప, ఫీల్డ్ అసిస్టెంట్ ఓంకార్, రైతు కరియన్న తదితరులు పాల్గొన్నారు.

వర్షానికి దెబ్బతిన్న వేరుశనగ పంట



వర్షానికి కొట్టుకుపోయిన వేరుశనగ పంట

పావగడ, ఆగస్టు 24 : తాలూకా వ్యాప్తంగా శుక్రవారం రాత్రి కురిసిన భారీ వర్షానికి కొన్నిచోట్ల వేరుశనగ పంట నీట మునిగి కొట్టుకుపోవడంతో నష్టం వాటిల్లినట్లు బాధిత రైతులు ఆవేదన వ్యక్తం చేశారు. ఈ సంవత్సరం 26వేల హెక్టార్లలో వేరుశనగ సా గు చేయగా పంట పిందె దశలో ఉంది. బారీ వర్షంతో పొంగిపొర్లిన వంకల్లో వేరుశనగ మొక్కలు కొట్టుకుపోయి, నీటిలో తేలడంతో తీవ్రంగా పంట నష్టపోయినట్లు తిప్పగానహళ్లికి చెందిన ప్రముఖ న్యాయవాది శ్యామన్న, గ్రంథా లయ కన్వీనర్ పద్మావతి దంపతులు వాపోయారు. తమ వృత్తితోపాటు వ్యవసాయం చేయాలన్న ఆలోచనతో నాలుగు ఎకరాల పొలాన్ని కౌలుకు తీసుకున్నామన్నారు. పంట సాగుకు దాదాపు రూ.35వేలు ఖర్చుచేశామని వారు తెలిపారు. పంట చేతికందుతుందన్న ఆనందంలో ఉండగానే ఆశలపై నీరు చల్లినట్లయిందన్నారు. రెవెన్యూ అధికారులు పంట పరిశీలించి నష్టపరిహారాన్ని లేదా పంట బీమాను అందించాలని కోరారు.